RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 24 అక్టోంబర్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:125

## భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనడానికి ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరగాలి

### దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి

### దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ సదస్సును ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు దక్షిణాది రాష్ట్రాలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అందుకు తెలంగాణ అనుసరిస్తున్న సాంకేతిక మౌలిక సదుపాయాలు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవడానికి సంసిద్ధంగా ఉన్నామని చెప్పారు.

హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసింగ్‌లో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలను వివరించి




నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దడంలో రాష్ట్రాల మధ్య సమన్వయ అవసరాన్ని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు.

"ఆయా రాష్ట్రాలు తమ సొంత వనరులు, ప్రయత్నాలతో మాత్రమే నేరరహిత రాష్ట్రాలుగా మార్చడం సాధ్యం కాదు. అందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం ఎంతో అవసరం. అత్యంత కీలకమైన ఇలాంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి" అని సదస్సును ఉద్దేశించి ముఖ్యమంత్రి కోరారు.

మిగతా 2 లో

## ఎల్‌నినో రాజకీయాలు కాదు.. ప్రజలకు అండగా నిలవాలి

### పార్టీ శ్రేణులు విపక్షాలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి



హైద్రాబాద్ అక్టోబర్ 23;ప్రజా భవన్ లో టీపీసీసీ ఆధ్వర్యం లో పార్టీ ఎంఎల్ ఏ లు,ఎంఎల్సీ లు,ఎంపీ లు,డీసీసీ అధ్యక్షులు,ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు హాజరైనారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

ఎల్ ని నో,ఎంఎల్సీ ఎలక్షన్ పైన దిశా నిర్దేశం చేశారు

ఎల్‌నినోపై రాజకీయాలు కాదు.. ప్రజలకు అండగా నిలవాలని పార్టీ శ్రీనులు విపక్షాలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో విమర్శలు చేయడం విచారకరమన్నారు.

కరోనా సమయంలో మోదీ పిలుపునకు స్పందించిన ప్రజలు..

ఇప్పుడు ప్రభుత్వానికి సహకరించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలదీ

విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు కాదు.. ప్రజలకు భరోసా ముఖ్య మన్నారు.

324 మండలాల్లో భూగర్భ జలాల కొరత..

రైతులను అప్రమత్తం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

మిగతా 4 లో

## కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్న ఆరోపణలను ఖండించిన శశిథరూర్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'ఫెయిల్డ్ ప్రొడక్ట్' వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ వాస్తవానికి రాహుల్ గాంధీపైనే పూర్తి దృష్టి సారించిందని, అందుకే ఆయన్ను ఒక విలన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారని, ఈ విషయాన్ని గమనించి బీజేపీ అప్రమత్తంగా ఉండాలని శశిథరూర్ సూచించారు.

ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఒక సదస్సులో శశిథరూర్ మాట్లాడుతూ, "గత కొన్ని నెలలుగా రాహుల్ గాంధీ ముఖ్యంగా యువ ఓటర్లలో గొప్ప ఉత్సాహాన్ని నింపారు. ఈ వాస్తవాన్ని బీజేపీ గుర్తించి మేల్కొంటే మంచిది. నిజానికి, బీజేపీ రాహుల్‌పైనే అమితమైన శ్రద్ధ చూపుతోందని, అందుకే ఆయన్ను ఒక ప్రతినాయకుడిగా చూపించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందని నేను భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.

అంతకుముందు గురువారం ఇదే వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన 'ఫెయిల్డ్ ప్రొడక్ట్'ని పదేపదే ప్రయోగించే క్రమంలో దేశాన్ని పణంగా పెడుతోందని విమర్శించారు. "శ్రీహరికోట నుంచి కూడా ఏడాదిలో ఇన్ని ప్రయోగాలు జరగవేమో కానీ, కాంగ్రెస్ మాత్రం తమ నేతను 'రీ-లాంచ్' చేసేందుకు అంతకంటే ఎక్కువసార్లు విఫలయత్నం చేస్తుంది" అంటూ పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ప్రధాని చేసిన ఈ ఆరోపణలను శశిథరూర్ తిప్పికొట్టారు. నెహ్రూ-గాంధీ కుటుంబం కాంగ్రెస్‌కు భారంగా మారిందన్న మోదీ వ్యాఖ్యలతో ఆయన ఏకీభవించలేదు. కాంగ్రెస్‌లో అపారమైన అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, దానికి తానే ఒక ఉదాహరణ అని శశిథరూర్ వెల్లడించారు.

"నేను కొన్ని సందర్భాల్లో పార్టీ నిర్ణయాలకు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసినప్పటికీ ఇప్పటికీ పార్టీలోనే కొనసాగుతున్నాను. పార్టీ నాకు పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షత వహించే అవకాశంతో పాటు ఎన్నికల ప్రచార బాధ్యతలను కూడా అప్పగించింది. నేను భిన్నమైన అభిప్రాయాన్ని చెప్పినంత మాత్రాన నన్ను పార్టీ వ్యతిరేకిగా చూడరు" అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను ఇతరులను ఎదగనీయని 'పరాన్నజీవి'గా అభివర్ణిస్తూ ప్రధాని చేసిన విమర్శలపై కూడా శశిథరూర్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్న విలువలు, దాని రాజకీయ విధానాలు తనకు బలమైన మద్దతునిస్తాయని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై బీజేపీ ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు.

## ఇరిగేషన్ ప్రాజెక్టులపై ముగిసిన సీఎం సమీక్ష సమావేశం

### తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులపై కీలక చర్చలు

హైదరాబాద్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ సంస్థ బోధి పెవిలియన్లో జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యులు ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులపై కీలక చర్చలు జరిగాయి. తుమ్మిడిహెట్టిపై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు.

ఈనెల 23 తర్వాత చర్చలకు పిలుస్తానని ఇటీవలే మహారాష్ట్ర సీఎం సూచన ప్రాయంగా అంగీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని తీసుకునే వీలుంది.. మహారాష్ట్ర పరిధిలో ఎంతమేరకు ముంపునకు గురవుతుందో అధికారులు వివరించారు. అటవీ, గిరిజన వెనుకబడ్డ ప్రాంతమైన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల



ఎకరాలకు సాగునీటిని అందించేందుకు వీలుగా బ్యారేజీ ఎత్తు ఉండాలని సీఎం సూచించారు.

అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మించేందుకు మహారాష్ట్రను ఒప్పించేందుకు వీలుగా అవసరమైన అన్ని నివేదికలు సిద్ధంగా ఉంచాలని, ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల వివరాలన్నీ అందుబాటులో ఉంచుకోవాలని సీఎం ఆదేశించారు.

డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీ, అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.

అందుకు వీలుగా శ్రీశైలం, నార్లాపూర్ నుంచి 0.6 టీఎంసీల నీటిని ఏదుల వరకు అదనంగా తెచ్చుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశాలు. దీంతో పాలమూరు నీటికి ఎలాంటి ధోకా ఉండదని సీఎం సూచించారు. అందుకు అవసరమైన పంప్ హౌజులు, పంపులు, సిస్టమ్ వెంటనే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు



వార్తా 4 లో

## ఎల్‌నినో ప్రపంచవ్యాప్త ప్రభావాలపై ప్రజలను చైతన్య పర్చాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

### రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

### సమాచార, పౌరసంబంధాల శాఖ, సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

హైదరాబాద్, అక్టోబర్ 23: ఎల్‌నినో ప్రభావాలు ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై చూపే ప్రభావం, వాటి వల్ల తలెత్తే పరిణామాలపై ప్రజలను చైతన్య పర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, తాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఎల్-నినో చూపే ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార శాఖ అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులకు నిర్వహించిన ఒకరోజు చైతన్య సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోందని , దాని ప్రభావాలను




ఎదుర్కొనేందుకు ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో 20 శాతానికి పైగా వర్షపాతం తక్కువగా నమోదయింది అన్నారు. దీనితో, దాదాపు 20 శాతం పంట విస్తీర్ణం తగ్గిందని, తద్వారా సరిపడా ధాన్యం, పశుగ్రాసం తగ్గిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో కేవలం 30 నుండి 40 శాతం నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో రానున్న జులై మాసం వరకు తాగు నీటికి అత్యంత ప్రాధాన్య నిస్తున్నామని వివరించారు. గత మూడు నెలలుగా రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం జరుగుతోందని, అత్యధికంగా 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని వెల్లడించారు. ఎల్ నినో పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రిగారు, మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు.

మిగతా 2 లో

ప్రజాబలం

24 అక్టోబర్ 2026 శనివారం

# ఎల్‌నినో ప్రపంచవ్యాప్త ప్రభావాలపై ప్రజలను చైతన్య పర్చాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు









**మొదటి పేజీ తరువాయి**

రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు అవగాహన కార్యక్రమాలు

సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజా అవగాహన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణానికి ఈ ప్రచారాన్ని విస్తరించి, ప్రజలందరికీ ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనే ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్ డోర్ మీడియా , సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ, జానపద కళారూపాల ప్రభావం గ్రామీణ ప్రజలపై గణనీయంగా ఉంటుందని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారంతో జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర ప్రజా అవగాహన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ సందేశాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా పౌరసంబంధాల అధికారులు (డీపీఆర్వోలు), తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొని, క్షేత్రస్థాయిలో ప్రజలకు చైతన్యం, అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని చేరవేసి, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నీటిని , విద్యుత్ ను అత్యంత పొదుపుగా వాడడం, ఎండల సమయంలో తగినంత నీరు తాగడం, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండడం, వృద్ధులు, చిన్నారులు, ఇతర సున్నిత వర్గాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటి జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించడం, నీటి వనరులను సమర్థంగా నిర్వహించడం, నీటి కొరతను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన సూచనలు, హెచ్చరికలు నిరంతరం చేరేలా వ్యవసాయ, విద్యుత్, పశు సంవర్ధక , రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్ సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎల్‌నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, సమాచార, పౌరసంబంధాల శాఖ మరియు తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ప్రచార కార్యాచరణను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏ. నరసింహా రెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, శ్రీనివాస్, మధు సూధన్ తో పాటువ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు, రాష్ట్రం లోని అన్ని జిల్లాల పౌర సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

# మళ్లీ చెలరేగుతున్న మాఫియా

ముంబైలో బాలీవుడ్ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస కాల్పుల ఘటనలు సినీ పరిశ్రమలో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన దాడి ఈ భయాలను మరింత పెంచింది. గతంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నివాసం, ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి ఇల్లు, రాజకీయ నాయకుడు బాబా సిద్ధిఖీపై జరిగిన దాడులను పరిశీలిస్తే.. కొన్ని ఘటనల్లో సల్మాన్ ఖాన్‌తో ఉన్న సంబంధాలను కారణంగా చూపుతూ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో ముంబైలో సినీ ప్రముఖుల భద్రత మరోసారి చర్చనీయాంశమైంది.ముంబైలోని జూహు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగినట్లు వచ్చిన వార్తలు కలకలం రేపాయి. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, ఆయన డ్రైవర్ గాయపడినట్లు పోలీసులు తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి. ఘటన అనంతరం బయటకు వచ్చిన ఓ ఆడియో రికార్డింగ్‌లో అనిల్ పండిట్ అనే వ్యక్తి తనను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవాడిగా చెప్పుకున్నట్లు సమాచారం.సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసేవారిని, తమకు అనుకూలంగా వ్యవహరించనివారిని లక్ష్యంగా చేసుకుంటామంటూ ఆ ఆడియోలో హెచ్చరికలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడి వెనుక హర్మన్ సంధు కూడా ఉన్నట్లు అనిల్ పండిట్ పేరును ప్రస్తావించినట్లు సమాచారం.2024 అక్టోబర్ 12న మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ బాంద్రాలోని తన కుమారుడి కార్యాలయం సమీపంలో కాల్పులకు గురయ్యారు. ముగ్గురు దుండగులు ఆయనపై కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయపడిన సిద్ధిఖీని లీలావతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించారు.బాబా సిద్ధిఖీకి బాలీవుడ్ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ముఖ్యంగా సల్మాన్ ఖాన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ హత్యకు తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న శుభమ్ లోంకర్ పేరుతో సోషల్ మీడియాలో పోస్టు వెలువడింది. సల్మాన్ ఖాన్‌కు మద్దతుగా నిలిచేవారికి హెచ్చరికలు జారీ చేస్తూ అందులో వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో టైగర్ ష్రాఫ్ ఘటనకు, బాబా సిద్ధిఖీ హత్యకు మధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, రెండు ఘటనల వెనుక ఒకే విధమైన ఉద్దేశం ఉందా? వాటి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందా? అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.2024 ఏప్రిల్ 14న ముంబైలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ ఖాన్ నివాసం గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ వెలుపల బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో విక్కీ గుప్తా, సాగర్ పాల్ అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆయుధాల సరఫరాకు సంబంధించి అనుజ్ థాపన్‌ను కూడా అరెస్టు చేశారు. అయితే 2024 మే 1న పోలీసు కస్టడీలో ఉండగా అతడు మరణించాడు. ఈ ఘటనపై కూడా పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి.సల్మాన్ ఖాన్‌పై దాడికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు బాధ్యత వహించినట్లు ప్రకటించారని వార్తలు వెలువడ్డాయి. సల్మాన్ ఖాన్‌పై గతంలో కూడా బెదిరింపు లేఖలు, ఈ-మెయిళ్లు వచ్చినట్లు పోలీసు రికార్డుల్లో ప్రస్తావించబడింది. పన్వేల్‌లోని ఆయన ఫామ్‌హౌస్ పరిసరాల్లోనూ అనుమానాస్పద కదలికలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి కృష్ణజింకల వేట కేసును ప్రస్తావిస్తున్నారు.. కృష్ణజింకలను పవిత్రంగా భావించే బిష్ణోయ్ సమాజ విశ్వాసాలను ఈ వివాదానికి కారణంగా చూపుతున్నారు.బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్‌కు సన్నిహితంగా ఉన్నారని భావించే ఇతర ప్రముఖులపై కూడా దాడులు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. 2026 ఫిబ్రవరిలో జూహులోని ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద కాల్పులు జరిగాయి. ఈ ఘటనకు సంబంధించి శుభమ్ లోంకర్ పేరుతో వచ్చిన ఆరోపణలు, హర్మన్ సంధు పేరు ప్రస్తావన మరోసారి చర్చకు దారితీశాయి.ఇదే సమయంలో కెనడాలోని సర్రేలో హాస్యనటుడు కపిల్ శర్మకు చెందిన కేఫ్‌పై 2025 జూలై నుంచి పలుమార్లు కాల్పులు జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. సల్మాన్ ఖాన్‌ను తన నెట్‌ఫ్లిక్స్ కార్యక్రమానికి ఆహ్వానించడమే ఈ దాడులకు కారణమని గ్యాంగ్‌తో సంబంధం ఉన్న వ్యక్తి పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి.టైగర్ ష్రాఫ్ ఘటనకు సంబంధించి ఆడియోలో పేర్లు వినిపించిన వ్యక్తులు అమెరికాలో ఉన్నట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ వార్తలు పేర్కొన్నాయి. మరోవైపు, బాబా సిద్ధిఖీ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న అన్మోల్ బిష్ణోయ్‌ను 2025 నవంబర్‌లో అమెరికా నుంచి భారత్‌కు తీసుకొచ్చి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసినట్లు నివేదికలు తెలిపాయి. అతడు పలు కేసులను ఎదుర్కొంటున్నాడు. ఈ పరిణామాలు నేర ముఠాల కార్యకలాపాలు, వాటి అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.ఒకవైపు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలకు బెదిరింపులు రావడం.. మరోవైపు వారి నివాసాలు, వ్యాపార సంస్థల వద్ద కాల్పుల ఘటనలు చోటుచేసుకోవడం ముంబై పోలీసులకు సవాలుగా మారింది. తాజా ఘటనల నేపథ్యంలో సినీ ప్రముఖుల నివాసాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం.టైగర్ ష్రాఫ్ ఘటనతో బాలీవుడ్‌లో భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. సల్మాన్ ఖాన్‌తో సంబంధాలను ప్రస్తావిస్తూ బెదిరింపులు చేస్తున్నారనే ఆరోపణలు నిజమా? ఈ దాడుల వెనుక ఒకే నెట్‌వర్క్ ఉందా? అనే ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తే సమాధానం చెప్పాల్సి ఉంది.

# భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనడానికి ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరగాలి

**మొదటి పేజీ తరువాయి**

"దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దడంతోపాటు, నేరాల రేటును అత్యంత కనిష్ఠ స్థాయికి తగ్గించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. వివిధ రాష్ట్రాల పోలీసు ప్రధాన కార్యాలయాల మధ్య సరిహద్దులు దాటి సమన్వయంతో పనిచేసేందుకు పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేయండి. సాంకేతిక మౌలిక సదుపాయాలు, ఐసీసీసీ వ్యవస్థను సమన్వయం చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మనమందరం సమష్టిగా కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనడానికి ఈ సదస్సు ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలతో సాగాలని ఆకాంక్షించారు.

"భద్రత, రక్షణ, నిస్పాక్షికంగా, నైతిక విలువలతో కూడిన సమర్థవంతమైన వ్యవస్థగా పోలీసింగ్ పనిచేయాలని ప్రజలు కోరుకుంటారు. పోలీసు వ్యవస్థకు ప్రభుత్వం సమకూర్చేవనరులను ఖర్చుగా భావించకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు పెట్టే పెట్టుబడిగా నేను భావిస్తాను. అందుకు ఎప్పటికప్పుడు అవసరమైన సంస్కరణలను తీసుకురావాలని భావిస్తా. రోజురోజుకు నేరాల స్వభావం మారుతున్న ఈ కాలంలో ఎస్ఆర్‌పీసీసీ వంటి వేదికలు ఎంతో కీలకంగా మారుతాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థ కూడా మారాలి. పోలీసింగ్‌లో సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలి అని చెప్పారు.

పోలీసు వ్యవస్థకు సంబంధించి తెలంగాణలో చేపట్టిన పలు సంస్కరణలు మంచి ఫలితాలను అందిస్తున్నాయి. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడం, వామపక్ష తీవ్రవాద హింసకు ముగింపు పలకడం వంటి రంగాల్లో తెలంగాణ పోలీసు శాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రతిభను చాటుకుని గుర్తింపు పొందింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి హైదరాబాద్ మహానగరంలో పోలీస్ వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా విభజించాం. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లుగా విభజించాం. ఈ విభజన వల్ల పోలీసు కమిషనర్లు తమ భౌగోళిక పరిధిపై ప్రత్యేక దృష్టి సారించి మరింత మెరుగైన ఫలితాలు అందించడానికి అవకాశం ఏర్పడింది. దీంతో పాటు నేరాల స్వభావానికి అనుగుణంగా ప్రత్యేక దృష్టిని సారించడానికి వీలుగా హైడ్రా , ఈగల్ , టీజీ-సేఫ్ , టీజీ టీమార్స్‌వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాం. ఈరోజుల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు అత్యంత కీలకమైన అంశాలుగా మారాయి. ప్రతి విభాగం, ప్రత్యేక విభాగాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, శిక్షణపై దృష్టి సారించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించగలుగుతాం. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి గారు నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించడంతో పాటు రాష్ట్రాన్ని పూర్తిగా నక్సల్స్ రహితంగా మార్చడంలో విశేష కృషి చేసిన తెలంగాణ పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అభినందించారు" అనిఈసందర్భంగాముఖ్యమంత్రిగుర్తు చేశారు.

"మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం సాధించిన పనితీరుకు కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా మార్కులిచ్చింది. సైబర్ నేరాల బాధితులకు కోల్పోయిన సొమ్మును తిరిగి అందించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. అమెరికాలోని ఎఫ్‌డీఏ తరహాలో ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను బలోపేతం చేయడం కోసం సమన్వయంతో పనిచేసే కొత్త విభాగం టీజీ-సేఫ్ ను ప్రారంభించాం" అని సదస్సులో వివరించారు. తెలంగాణ ప్రారంభించిన హైడ్రాచెరువులు, జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, వాటికి పూర్వవైభవం తీసుకురావడం ద్వారా ప్రజల మనసులను గెలుచుకుంటోంది. అదే సమయంలో ప్రజా ఆస్తులు, ప్రభుత్వ ఆస్తుల భద్రతను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తోంది అని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించిన దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. "ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. పోలీసు సంక్షేమం విషయంలో కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యనిస్తోంది. వృత్తి రీత్యా పోలీసు సిబ్బంది ప్రధానంగా ఎదుర్కొనే సమస్యల్లో వారి పిల్లల భవిష్యత్తు ఒకటి. పోలీసు కుటుంబాల పిల్లలకు దేశంలోని అత్యుత్తమ సైనిక్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు హైదరాబాద్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేశాం. హోంగార్డు నుంచి డీజీపీ వరకు అన్ని స్థాయిల్లోని సిబ్బంది పిల్లలకు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించే అవకాశం కల్పించాం. ఎంతో ధైర్యసాహసాలతో ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాల భవిష్యత్తుకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారి వరకు, వారి హోదా, సర్వీసు ఆధారంగా కనీసం రూ.1 కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నాం. ఇంటి స్థలంతో పాటు కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించడం వంటివి అమలు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి పోలీసు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ , కర్ణాటక డీజీపీ డాక్టర్ ఎంఏ సలీమ్ , తమిళనాడు డీజీపీ డాక్టర్ మహేష్ అగర్వాల్ పుదుచ్చేరి డీజీపీతి షాలిని సింగ్ , లక్షద్వీప్ ఏడీజీ బి. శంకర్ జైస్వాల్ , కేరళ ఐజీ అజీతా బేగం , ఆంధ్రప్రదేశ్ ఐజీపీ రవి కృష్ణ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల వేళ పలు చోట్ల ఉద్రిక్తతలు

తిరుపతి, అక్టోబరు 23, ఏపీలో స్థానిక ఎన్నికల వేళ పలు చోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని చిన్నగొట్టిగల్లు మండలం కురవపల్లిలో దారుణ చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన సింగిల్ విండో చైర్మన్ ముట్టమ్ ప్రభాకర్‌కు చెందిన కారుకు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ నిప్పు పెట్టారు. సీసీ కెమెరాలను పక్కకు తిప్పి మరీ, 4 పెట్రోల్ క్యాన్లతో వచ్చి అత్యంత పగడ్బందీగా కారుకు నిప్పు పెట్టి దగ్ధం చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.గతంలో మాజీ చైర్మన్ సహదేవ రెడ్డికి సంబంధించిన అవినీతి అక్రమాలను ముట్టమ్ ప్రభాకర్ వెలుగులోకి తీసుకువచ్చారని, ఆ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కారు దగ్ధం చేశారని ఆయన ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీకి ప్రజల నుంచి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రత్యర్థులు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేటీఆర్ ఇలాకాలో చెత్త పాలన..
# సిరిసిల్ల ప్రజల ప్రాణాలతో చెలగాటం!

**నియోజకవర్గాన్ని గాలికొదిలేసిన ఎమ్మెల్యే..**
**రోడ్లపై నరకం చూస్తున్న ప్రజలు**
**అవార్డులన్నీ ప్రచారానికేనా?**
**గల్లీల్లో కంపు కొడుతున్న 'స్వచ్ఛ' సిరిసిల్ల**
**కమిషనర్ జాడలేదు, చైర్ పర్సన్, కౌన్సిలర్లు పట్టించుకోరు..**
**మొద్దునిద్రలో మున్సిపల్ యంత్రాంగం!**

రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 23,( ప్రజాబలం ప్రతినిధి )రాష్ట్రంలోనే వీఐపీ నియోజకవర్గంగా చెప్పుకునే సిరిసిల్ల పరువు నడిరోడ్డుపై పేరుకుపోయిన చెత్తకుప్పల సాక్షిగా గంగలో కలుస్తోంది. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఇలాకాలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా అటకెక్కింది. మాటల్లో చెప్పే 'హైటెక్ సిరిసిల్ల', కాగితాలపై రాసుకునే 'స్వచ్ఛ సర్వేక్షన్' అవార్డులు కేవలం ప్రచారార్భాటానికే పరిమితమయ్యాయా అన్న ప్రశ్నలు కాలనీలలో వెల్లువెత్తుతున్నాయి.



ఎమ్మెల్యే ఉన్నారా.. నియోజకవర్గాన్ని వదిలేశారా?

గెలిపించిన ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే అసలు సిరిసిల్లలో ఉన్నారా లేరా అన్నది అర్థం కాని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో పర్యటించి ప్రజల బాధలు తీర్చాల్సిన బాధ్యతను గాలికొదిలేశారన్న ఆగ్రహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. అటు మున్సిపల్ కమిషనర్, పాలకవర్గ చైర్ పర్సన్ , వార్డు కౌన్సిలర్లు కనీసం తమ ప్రాంతాలను పరిశీలించకపోవడంతో వీధులన్నీ డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.





రోగాల కుంపటిగా మారిన కాలనీలు

రోజుల తరబడి మున్సిపల్ అధికారులు పారిశుధ్య వాహనాలను పంపకపోవడంతో రోడ్ల పక్కనే మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్ళిన చెత్త పేరుకుపోయి ముక్కుపుటాలు అదిరిపోయే దుర్వాసన వెదజల్లుతోంది. వీధి కుక్కలు వ్యర్థాలను రోడ్డంతా లాగి పారేస్తుండటంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారుణ పరిస్థితుల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక విషజ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి వెంటనే యుద్ధప్రాతిపదికన కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తరలించి, బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శించి 10 వేల ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజ సూర్య రామ్

### కుటుంబ సభ్యులకు మనోధైర్యం..
### అండగా ఉంటామని భరోసా

మంగపేట మండలంలోని వాగొడ్డు గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన కురుసం వెంకట నర్సయ్య మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తనయుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజ సూర్య రామ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుమారులు కురుసం నరసింహారావు, కురుసం విష్ణుమూర్తిలను కలిసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారికి మనోధైర్యం కల్పిస్తూ, కుటుంబానికి తక్షణ సహాయంగా రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, సీతక్క గారు, తాము ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు:



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అయ్యోరి యానయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి, ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షులు పుల్లూరి తిరుపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు, రాజుపేట మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాసరావు, మండల నాయకులు సున్నం ఆనందం, తుమ్మల ముఖర్జీ, తుమ్మూరి రాంరెడ్డి, కబ్బాక లక్ష్మణ్, మూగల చంటి, బూర్గుల సతీష్, పొట్రు సమ్మయ్య, వీరరెడ్డి, ఇందారపు లక్ష్మణ్, కారం రాజేశ్, నూతులకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పంటకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు
## వీడియో వైరల్ కావడంతో అధికారుల క్షేత్ర పర్యటన

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో రైతు నల్లాల శ్యామ్‌సుందర్‌రెడ్డి ఎనిమిది ఎకరాల్లో వేసిన వరి పంట ఎండిపోతుండగా, నాలుగు నీటి ట్యాంకర్ల ద్వారా నీళ్లందిస్తున్న విషయాన్ని నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అధికార యంత్రాంగం మొత్తం రైతు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి, విద్యుత్తు సరఫరా ఎలా ఉందంటూ పలువురు రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్తు సరఫరా సమయాన్ని గతంలో మాదిరిగా పొడిగించాలని, అంతేకాకుండా సాయంత్రం, రాత్రి వేళల్లోనూ కొంతసమయం కరెంట్ ఇస్తే చివరి దశలో ఉన్న పంట పొలాలకు తడులు అందించే అవకాశం ఉంటుందని రైతులు తమ బాధలను చెప్పుకున్నారు

# ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సాహసం వెలగట్టలేనిది

### జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహణ.
### కొవ్వొత్తుల ర్యాలీతో పోలీస్ అమరవీరులకు ఘన నివాళి
### అడిషనల్ ఎస్పీ సదానందం

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 ములుగు**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులర్పించేందుకు ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సదానందం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ములుగు బస్టాండ్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏరియా హాస్పిటల్ జంక్షన్ వరకు వెళ్లి తిరిగి బస్టాండ్ జంక్షన్ వద్దకు చేరుకుంది. అక్కడ ఏర్పాటుచేసిన అమరవీరుల ఫ్లెక్సీ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది అమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు.




దేశ భద్రత, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రజలకు తెలియజేయడంతో పాటు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సాహసం, అంకితభావాన్ని స్మరించుకోవడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశం.

ఈ కార్యక్రమంలో ములుగు డి.ఎస్.పి రవీందర్, ఆర్ ఐ స్వామి, శ్రీకాంత్, తిరుపతి, ఎస్హెచ్ఓ వెంకటేష్, ఎస్సై లు చంద్రశేఖర్, రచిత్ర, సాయి కృష్ణ, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారూ

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

### లబ్ధిదారులు పనులు ప్రారంభిస్తే వెంటనే బిల్లుల చెల్లింపు
### మండల ప్రత్యేక అధికారి రాజు

**మెదక్ జిల్లా కొల్చారం మండలం అక్టోబర్ 23 (ప్రజా బలం) ప్రతినిధి:**కొల్చారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు.

మండలంలో మొదటి విడతలో 368 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 268 మందికి పైగా లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.





కొందరు లబ్ధిదారులు ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. నిర్మాణ పనులు వేగంగా చేపడితే ప్రభుత్వం నిబంధనల ప్రకారం బిల్లులను సకాలంలో చెల్లించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నిధులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఇందిరమ్మ గృహాల ఏఈ సీతారాం, సీతారాం తండా సర్పంచ్ వినోద్ నాయక్, వివిధ గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే మన లక్ష్యం,
## డాక్టర్ డి రామారావు జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 23:**ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ పోలియో వ్యాధి నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని, పోలియోవైరస్ వలన వ్యాపిస్తుందని, పోలియో ఒక ప్రమాదకరమైన వ్యాధి అని ఇది ముఖ్యంగా కలుషితమైన ఆహారము మరియు నీరు, పోలియో సోకిన వ్యక్తి మలము ద్వారా ఈ వైరస్ బయటకు వస్తుందని,చేతులు సరిగా కడుక్కోకపోవడం వల్ల లేదా పారిశుద్ధ్య లోపాలు ఉన్నప్పుడు ఈ వైరస్ ఆహారము,తాగునీటి ద్వారా ఇతరుల శరీరంలోకి నోటి ద్వారా ప్రవేశిస్తుందని ఇది ప్రధానంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ప్రభావితం చేసి, శాశ్వత పక్షవాతానికి గురిచేస్తుందని పేర్కొనడం జరిగింది.

పోలియో వ్యాధిని పూర్తిగా నివారించడానికి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ ప్రకారం పోలియో చుక్కలు, పోలియో టీకాలు వేయించడం అత్యంత ముఖ్యమైనదని పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని , భారతదేశంలో 2011 నుంచి ఇంతవరకు ఒక్క పోలియోకేస్ కూడా నమోదు కాలేదని అలాగే తెలంగాణ రాష్ట్రంలో 2007 సంవత్సరం తర్వాత నుంచి ఇంతవరకు ఒక కేసు పోలియో పాజిటివ్ నమోదు కాలేదని, పోలియోపై అపోహలను నమ్మకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలనితెలియపరిచారు

## తుమ్మలపెంట ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మూలే రామేశ్వర్ రెడ్డి...

కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా మూలే రామేశ్వర్ రెడ్డి ఇవాళ ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ వేశారు. కొలిమిగుండ్ల మండల టిడిపి అధ్యక్షుడిగా మూలే రామేశ్వర్ రెడ్డి ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. త్వరలోనే ఆయనకు పెద్ద ఉన్నత స్థాయి పదవి దక్కనున్నట్లు ఆయన అభిమానులు చర్చించుకుంటున్నారు. రామేశ్వర్ రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా చివరి రోజు కావడంతో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తోట అమర్నాథ్ రెడ్డి, నాగ మల్లారెడ్డి, బాయికాటి బ్రదర్స్, రవి ప్రకాష్ రెడ్డి, లోకే పల్లె మధు ప్రసాద్ రెడ్డి, ఇంకా తదితరు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్‌నినో రాజకీయాలు కాదు.. ప్రజలకు అండగా నిలవాలి

## పార్టీ శ్రేణులు విపక్షాలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి

ప్రకృతి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాదు.. ప్రజలకు అండగా నిలవడమే రాజకీయ పార్టీల బాధ్యత కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కరోనా సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపులకు స్పందించి ప్రజలు చప్పట్లు కొట్టడం, గంటలు మోగించడం, దీపాలు వెలిగించడం ద్వారా ప్రభుత్వాలకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం విచారకరమని వ్యాఖ్యానించారు. ప్రజలకు మేలు చేసే సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కావడం సమంజసం కాదని హితవు పలికారు.

?శుక్రవారం ప్రజాభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పీసీసీ ముఖ్య నాయకులు, డీసీసీ అధ్యక్షులతో నిర్వహించిన ఎల్‌నినోపై అవగాహన, ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఇలాంటి సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేసి ప్రజలకు భరోసా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

?విమర్శలు కాదు.. నిర్మాణాత్మక సూచనలు ఇవ్వండి

?పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్ర వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాల కొరత ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేయడం, నీటి వినియోగంపై అవగాహన కల్పించడం అందరి బాధ్యతని స్పష్టం చేశారు.

?కరోనా సమయంలో ప్రభుత్వాల పిలుపులకు ప్రజలు ఏ విధంగా సహకరించారో గుర్తు చేసుకోవాలని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూడా అదే స్ఫూర్తితో సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిపక్షాలు ప్రజలకు మేలు చేసే అంశాలపై సూచనలు ఇవ్వాలని, ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారం అందించాలని కోరారు.

?324 మండలాల్లో భూగర్భ జలాల కొరత

?వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయని, రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉండగా, ఈ నెలలో దాదాపు 15 లక్షల పంపుసెట్లు వినియోగంలో ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటినట్లు అధికారులు అంచనా వేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. బోరుబావుల్లో నీరు లేకపోయినా మోటార్లు ఆన్ చేయడంతో అవి కాలిపోతున్నాయని, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు.

?ఈ సమస్యను నివారించేందుకు భూగర్భ జలాల లభ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నీరు లేని ప్రాంతాలను గుర్తించి, మోటార్లు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు సమాచారం అందించి రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు.

?రబీలో ప్రత్యామ్నాయ పంటలే మేలు

?కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా వ్యవసాయ శాఖ సూచించిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని భట్టి విక్రమార్క తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, రాష్ట్రంలో 20,018 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైందని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్, నీటి వినియోగంపై ముందస్తు ప్రణాళికలు అవసరమన్నారు.

?ప్రజలకు తాగునీరు అందించడమే తొలి ప్రాధాన్యం

?రానున్న రోజుల్లో ప్రజలు, పశువులు, పక్షులు సహా అన్ని జీవరాశులకు తాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నీటి వనరులను సంరక్షించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ప్రకృతి సవాళ్లను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం, వారికి భరోసా కల్పించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

# కోటియాలో కొత్త పంచాయితీ

శ్రీకాకుళం, అక్టోబరు 23, ఆంధ్రప్రదేశ్ – ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లోని కోటియా సరిహద్దు పంచాయతీ సరికొత్త రాజకీయ, సామాజిక ఆందోళనలకు వేదికగా మారింది. కోటియా పరిధిలోని గ్రామాల్లో ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతున్నట్లు చేసిన ప్రకటనతో సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఒడిశాకు చెందిన పలు రాజకీయ పార్టీలు, స్థానిక గిరిజన సంఘాలు ఏపీ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఆంధ్రా గో బ్యాక్ నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. ఈ పరిణామంపై ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ మనుగడకు ఏపీలోని చంద్రబాబు నాయకత్వంలోని అధికార టీడీపీ మద్దతు కీలకంగా మారడం వల్లే, ఒడిశాలోని ప్రస్తుత బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్ర సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతూ మౌనం వహిస్తోందని సంచలన ఆరోపణలు చేశారు.అసలు ఈ సరిహద్దు పోరుకు మూలాలు స్వాతంత్ర్యానికి పూర్వమే బలంగా పడ్డాయి. 1936లో దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఒడిశా ఏర్పాటైనప్పుడు.. పూర్వపు జైపూర్ జమీందారీ, కొరాపుట్ పరిధిలోని పొట్టంగి తాలూకా కింద ఉన్న కోటియా ప్రాంతం తమదేనని ఒడిశా ప్రతిపాదిస్తోంది. అయితే, 1953లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడివడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సమయం నుంచి.. 28 గ్రామాలున్న ఈ కోటియా పంచాయతీలోని 21 గ్రామాలు తమ పరిధిలోని విజయనగరం ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు తాలూకా కిందకే వస్తాయని ఆంధ్రప్రదేశ్ బలంగా వాదిస్తోంది. ఈ వివాదం దశాబ్దాలుగా తేలకపోవడంతో 1968లోనే ఇరు రాష్ట్రాలు సుప్రంకోర్టు గడప తొక్కాల్సి వచ్చింది.క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే.. కోటియా గ్రామాలపై ఆంధ్రప్రదేశ్ మొదటి నుంచీ పక్కా అధికారిక , ల్యాండ్ రికార్డుల ఆధారాలతో వాదిస్తూ వస్తోంది. ఈ గ్రామాల్లో నివసించే మెజారిటీ ప్రజలు తెలుగు భాషతో పాటు స్థానిక గిరిజన మాండలికాలు మాట్లాడటం ఏపీకి సానుకూలాంశంగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఏపీ అధికారికంగా వారికి రేషన్ కార్డులు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు ఇస్తూ, విద్యుత్, రహదారుల నిర్మాణంతో పాటు సంక్షేమ పథకాలను చేరవేస్తోంది. సాలూరు అసెంబ్లీ, అరకు లోక్‌సభ స్థానాల పరిధిలోనే ఓటింగ్ నిర్వహిస్తోంది. ప్రజాస్వామ్యంలో స్థానిక గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడటం రాజ్యాంగబద్ధమైన బాధ్యతని ఏపీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. 1968లో దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఇరు రాష్ట్రాలను యథాతథ స్థితి పాటించాలని ఆదేశించింది. అనంతరం 2006లో తుది తీర్పునిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దుల విభజన అంశం న్యాయస్థానాల పరిధిలోనిది కాదని, పార్లమెంట్ మాత్రమే చట్టం ద్వారా తేల్చాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ, 2021లో ఏపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించగా ఒడిశా సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ను వేసింది. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలు, సంయుక్త కమిటీల ఏర్పాటు , ఇటీవల ఒడిశా నియమించిన 16 మంది సభ్యుల కోటియా కమిటీ అధ్యయనాలు జరిగినప్పటికీ సమస్య మాత్రం మొదటి కొచ్చింది.ప్రస్తుతం కోటియా పంచాయతీ గిరిజనుల జీవితం రెండు రాష్ట్రాల ద్వంద్వ పాలన మధ్య నలిగిపోతోంది. ఇక్కడి ప్రజలు ఏపీ, ఒడిశా రెండు ప్రభుత్వాల నుంచి రేషన్, పింఛన్లు, ఇళ్లు పొందుతూ రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఓట్లు వేస్తున్నారు. ఒకరి కంటే మరొకరు ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామంటూ ఇరు రాష్ట్రాల అధికారులు పోటీ పడుతున్నప్పటికీ, సరిహద్దు వివాదం వల్ల శాశ్వత అభివృద్ధి పనులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన ఇక్కడ మూలపడిపోతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఈ సెంటిమెంట్‌ను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం పరిపాటిగా మారింది. రాజకీయ విమర్శలు, ప్రాంతీయ సెంటిమెంట్లను పక్కనబెట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది.

# పద్మావతి అమ్మవారికి ఘనంగా పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పణ

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో వెల్లివిరిసిన భక్తిభావం

## శివనగర్ శివాలయం నుంచి శోభాయాత్రగా తరలిన పద్మశాలీలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 23, (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల శ్రీ శాల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సిరిసిల్ల పట్టణంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పద్మశాలీల ఇలవేల్పు, ఇంటి ఆడపడుచు అయిన శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, సాంప్రదాయ ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది.

ముందుగా స్థానిక శివనగర్ శివాలయం వద్ద మహిళలు సాంప్రదాయబద్ధంగా ఒడిబియ్యం, పట్టువస్త్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ శోభాయాత్రగా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన పద్మావతి





అమ్మవారికి పట్టణ పద్మశాలి సంఘం ప్రతినిధులు, ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. లోకకల్యాణం, చేనేత వర్గాల సంక్షేమం కోరుతూ వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు, పద్మశాలి ఆడపడుచులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# అవని క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల బాత్రూంకు మరమ్మత్తులు.




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 23:** వైరాలోని ప్రభుత్వ పాఠశాలలో వాష్ రూమ్ డోర్లను వెంటిలేటర్ ను కిటికీని అవని క్లబ్ ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయించారు. స్థానిక హెడ్ మాస్టర్ అవని క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకొని రాగా స్పందించి వాష్ రూమ్ కు ప్లాస్టింగ్ డోరు మరమ్మత్తు వెంట వెంటనే కిటికీలను ఏర్పాటు చేయించారు అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఎంతోకాలంగా అపరిస్కృతంగా ఉన్న వాష్ రూమ్ కు డోర్ ను కిటికీలను వెంటిలేటరుకు అడిగిన వెంటనే మరమ్మతులు చేయించిన అవని క్లబ్ సభ్యులను ఆమె ప్రశంసించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్ సి ఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు,జిల్లా జిఈటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యాంబాబు,అవని క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ,సెక్రటరీ సుగల మాధవి పువ్వాళ జయశ్రీ రాయల విజయలక్ష్మి వనమా సునీత నాళ్ళ నాగమల్లేశ్వరి వడ్లమూడి విజయలక్ష్మి ఈడుపుగంటి రత్నకుమారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో ఇద్దరు పీఎంకేఎస్‌వై అధికారులు

భూపాలపల్లి బిల్లులపై 25 శాతం కమిషన్ డిమాండ్ చేలతూ ఇద్దరు పీఎంకేఎస్‌వై అధికారులుఏసీబీకి దొరికిపోయారు. రూ.1.62 కోట్ల పనుల బిల్లుల వ్యవహారంలో కాంట్రాక్టర్ నుంచి రూ.39 లక్షలు లంచం డిమాండ్ చేసారు సతీశ్‌రెడ్డి, రాజు. పలుమార్లు ఆన్‌లైన్‌లో నిందితుల ఖాతాలకు నగదు బదిలీ చేయించుకున్నారు. తాజాగా మరో రూ.1.34 లక్షల బిల్లులోనూ కమిషన్ డిమాండ్ చేసారు. దాంతో బాధిత కాంట్రాక్టర్ విసిగిపోయి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. బంధువుల పేరిట ఉన్న సుమారు 40 ఫోన్‌పే ఖాతాల్లోకి నగదు బదిలీ చేసినట్లు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాకాబందీ

హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నివారణ, నిఘా పటిష్టత, ప్రజల భద్రత లక్ష్యంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ సీల్ ఎంలో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా 54 నాకాబందీ కేంద్రాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, వివిధ నాకాబందీ కేంద్రాలను సందర్శించి, కొనసాగుతున్న తనిఖీలను సమీక్షించారు. తనిఖీలు సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

## అందుబాటులోకి వందే భారత్ ట్రైన్స్..

అనంతపురం, అక్టోబరు 23, దేశీయ రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సిరీస్‌లో స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వస్తుండటంతో ప్రయాణికుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ హౌరా-గువహతి మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించగా, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా ఈ లగ్జరీ ప్రయాణ సదుపాయం అందుబాటులోకి రానుంది. దసరా పండుగ సందర్భంగా ముంబై, బెంగళూరు నగరాల మధ్య నడిచే ఈ ప్రతిష్టాత్మక రైలు ఏపీ మీదుగా రాకపోకలు సాగించనుండటంతో రాయలసీమ ప్రాంత వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. బెంగళూరు నుంచి ముంబై మధ్య 1,118 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేసే ఈ రైలు ప్రయాణ సమయాన్ని 20 గంటల నుంచి 16 గంటలకు తగ్గించనుంది. ఏపీలోని ధర్మవరం, అనంతపురం, గుంతకల్ రైల్వే స్టేషన్లలో ఈ రైలుకు స్టాపేజ్ కల్పించారు. దీనివల్ల ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు బెంగళూరు, ముంబై నగరాలకు వేగంగా చేరుకోవడానికి వీలు కలుగుతుంది. ప్రతిపాదిత వేళల ప్రకారం బెంగళూరులో రాత్రి 7.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.55 గంటలకు ముంబై చేరుకుంటుంది. మ్యాప్‌లు చూడండివిమానం తరహాలోనే అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు ఈ వందే భారత్ స్లీపర్ రైలు సొంతం. ఇందులో సెన్సార్ ఆటోమేటిక్ డోర్లు, సీసీటీవీ కెమెరాలు, అత్యవసర టాక్ బ్యాక్ సిస్టమ్, పవర్ సప్లై కోసం యూఎస్‌బీ ఛార్జింగ్ పాయింట్లు, అధునాతన 'కవచ్' రక్షణ వ్యవస్థ అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గంలో టికెట్ ధర సుమారు రూ. 3,000 వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తుండగా, పూర్తి వివరాలను రైల్వే శాఖ త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.

## జోగి మేఘన కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### మాజీ మంత్రి జోగి రమేష్‌పై అనుమానం వ్యక్తం చేసిన మేఘన తండ్రి

ఇబ్రహీంపట్నం తమకు జరిగిన ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయని జోగి మేఘన తండ్రి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఈ ఘటనలో వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ హస్తం ఉండి ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ నెల 15న జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి కృష్ణ విజయవాడ నుంచి తెలంగాణ రాష్ట్రం కోదాడ వైపు వెళ్తున్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వీరి కారును ఢీకొనగా వాహనం కొంత భాగం దెబ్బతింది. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, తమకు ప్రాణహాని ఉన్నందున విచారణ చేయాలని మేఘన తండ్రి కృష్ణ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 16న ఫిర్యాదు చేశారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు అప్పుడే కేసు నమోదు చేశారు.

ఇప్పటికే మేఘన.. హత్యాయత్నం, వరకట్న వేధింపుల ఆరోపణలతో మామ రమేష్, భర్త రాజీవ్, మరికొందరు కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేయడం, వారి వల్ల తనకు ప్రాణహాని ఉందని ఇబ్రహీంపట్నం పోలీసులకు మూడు నెలల కిందట ఫిర్యాదు చేయగా కేసు నమోదైన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో కారు ప్రమాద ఘటనపై జోగి రమేష్ ప్రమేయం ఉండవచ్చని మేఘన తండ్రి పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని కోరారు.

## అంబులెన్స్ ఢీకొన్న లారీ, ఇద్దరు మృతి

నిర్మల్ సోన్ మండలం కడ్తాల్ వై జంక్షన్ వద్ద సాగర్ కన్వెన్షన్ ముందర గురువారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై తమిళనాడు నుండి ఉత్తరాఖండ్ వైపు వెళ్తున్న లారీ, బొలెరో అంబులెన్స్ (ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వ వాహనం) నిర్మల్ నుండి హైదరాబాద్ వెళ్తున్న పేషెంట్ ను తీసుకు వెళుతున్న క్రమంలో రాంగ్ రూట్లో వచ్చి ఢీకొంది. ఘటనలో అంబులెన్స్ లో ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తీవ్ర గాయాలైన మిగతా నలుగురు వ్యక్తులకు చికిత్స నిమిత్తం నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు పారు భాయ్ , సరస్వతి. సోము, శైలజ, గీత లకు తీవ్ర గాయాలయ్యాయి

## 4 ప్రభుత్వ బ్యాంకుల్లో కేంద్రం వాటా విక్రయం

ముంబై, అక్టోబరు 23, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు ప్రభుత్వ సంస్థల్లో క్రమంగా వాటాల్ని విక్రయిస్తున్నారు. ఆఫర్ ఫర్ సేల్ ప్రక్రియలో వాటాల అమ్మకం చేపడుతోంది. ఇటీవల ఐడీబీఐ బ్యాంకులో సుమారు 60.72 శాతం వాటాను కెనడా సంస్థకు విక్రయించే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికీ పలు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల్లో మెజార్టీ వాటా ఉంది. అయితే మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కనీసం 25 శాతం ఉండాలి. దీంతో 75 శాతానికిపైగా తమ వాటా ఉన్న సంస్థల్లో కేంద్రం క్రమంగా వాటాల్ని విక్రయిస్తూ వస్తోంది. ఒకవైపు ఈ నిబంధనకు తోడు నిధులు సమీకరించాలన్న లక్ష్యంతో మరికొన్ని సంస్థల్లోనూ వాటాల విక్రయం కోసం ఆఫర్ ఫర్ సేల్ నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాదిలో ఎల్ఐసీ సహా బీహెచ్ఈఎల్, ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, కోల్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇలా పలు ప్రభుత్వ సంస్థల్లో వాటాల్ని విక్రయించింది. కొద్ది రోజుల కిందట ప్రైవేట్ బ్యాంక్ ఐడీబీఐ బ్యాంకులోనూ కేంద్రం, ఎల్ఐసీ కలిసి 60.72 శాతం వాటాను కెనడా సంస్థకు విక్రయించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో ఇప్పుడు ఇతర ప్రభుత్వ బ్యాంకుల్లో వాటా విక్రయం సహా బ్యాంకుల ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కేంద్రం ప్రస్తుతం 4 ప్రభుత్వ రంగ బ్యాంకులు- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్లో తమ వాటాను విక్రయించి 75 శాతం దిగువకు చేర్చాలని భావిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ బ్యాంకుల విలీనం లేదా ప్రైవేటీకరణ అంశాలపైనా పనిచేస్తుందని తెలుస్తోంది. మరో 2 బ్యాంకుల్ని ప్రైవేటీకరించనున్నట్లు, ఆ దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు ఈ వ్యవహారం గురించి తెలిసిన వ్యక్తుల్ని ఉటంకిస్తూ మీడియా రిపోర్ట్స్ వస్తున్నాయి. 2021-22 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ విలీనాలు, బ్యాంకుల ప్రైవేటీకరణను ప్రస్తావించింది. ఐడీబీఐ బ్యాంకు కాకుండా, మరో రెండు ప్రభుత్వ బ్యాంకులు, సాధారణ ఇన్సూరెన్స్ కంపెనీని ప్రైవేటీకరించాలని చూస్తున్నట్లు ప్రకటించింది. ఆ దిశగానే ఇప్పుడు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఏ బ్యాంకుల్ని విలీనం చేస్తుంది, ఏ బ్యాంకుల్ని ప్రైవేటీకరించాలని చూస్తోందనే అనే వివరాలు స్పష్టంగా తెలియరాలేదు. నీతి ఆయోగ్ మాత్రం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్ని ప్రైవేటీకరించడానికి షార్ట్ లిస్ట్ చేసినట్లు సమాచారం. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి 92.44 శాతం వాటా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో 2.17 శాతం వాటా విక్రయించి రూ. 1419 కోట్లు సమీకరించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 81.19 శాతం వాటాను కేంద్రం కలిగి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే 8.08 శాతం వాటాను విక్రయించి సుమారు రూ. 2666 కోట్లు సేకరించింది. యూకో బ్యాంకులో 90.95 శాతం వాటా ప్రభుత్వానిదే. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం 93.85 శాతం వాటా కలిగి ఉంది.

ఇక్కడ ఇంకా చాలానే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకులు 10కిపైగా ఉండగా, పలు చిన్న బ్యాంకుల్ని విలీనం చేసి దేశంలో 2-3 లేదా పెద్ద బ్యాంకుల్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కూడా తెలుస్తోంది. ఇందులో భాగంగానే తొలుత రాబోయే ఏడాదిలోగా పైన నాలుగు బ్యాంకుల్లో కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్ 25 శాతం ఉండేలా వాటాల్ని విక్రయించి, ఆ తర్వాత ప్రైవేటీకరణ గురించి ప్లాన్ చేయనున్నట్లు భావిస్తున్నారు. ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం, ఎల్ఐసీ 30.24 శాతం వాటాను విక్రయించనుండగా, మొత్తం 60.72 శాతం వాటాను సుమారు రూ. 53 వేల కోట్లకు విక్రయించనుంది. ఈ ప్రతిపాదనకు కొద్ది రోజుల కిందటే కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చింది. కెనడాలోని ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ పూర్తి స్థాయి అనుబంధ సంస్థ కెనడా ఇంక్‌కు విక్రయించనుంది. అప్పుడు మెజార్టీ వాటా ఆ సంస్థదే అవుతుంది. వాటా విక్రయం తర్వాత కూడా ఎల్ఐసీకి సుమారు 19 శాతం వాటా ఉంది

# తండ్రి కాబోతున్న గే పీఎం...

న్యూఢిల్లీ, అక్టోబరు 23, (న్యూస్ పల్స్) నెదర్లాండ్స్ రాజకీయాల్లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఓ ఆసక్తికరమైన వార్త చర్చనీయాంశంగా మారింది. ఆ దేశ ప్రధాని రాబ్ జెట్టెన్, ఆయన భాగస్వామి, అర్జెంటీనాకు చెందిన హాకీ క్రీడాకారుడు నికోలస్ కీనన్ తల్లిదండ్రులు కాబోతున్నారు. స్వలింగ సంపర్కులైన ఈ జంట సరోగసీ విధానం ద్వారా బిడ్డను తమ జీవితంలోకి ఆహ్వానించేందుకు సిద్ధమైంది. 2027లో తమ కుటుంబంలోకి చిన్నారి రానున్నట్లు జెట్టెన్ వెల్లడించినట్లు సమాచారం. దీంతో అసలు సరోగసీ అంటే ఏమిటి? ఇద్దరు పురుషులు ఈ విధానం ద్వారా తండ్రులు ఎలా అవుతారు? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది. సరోగసీ అనేది సంతానం కోసం మరో మహిళ సహాయాన్ని తీసుకునే వైద్యపరమైన విధానం. కొన్ని కారణాల వల్ల స్వయంగా గర్భం దాల్చలేని వ్యక్తులు లేదా దంపతులు ఈ పద్ధతిని ఆశ్రయిస్తారు. ఇందులో గర్భాన్ని మోసే మహిళను 'సరోగేట్ మదర్' అంటారు. వైద్యపరమైన ప్రక్రియ ద్వారా ఆమె గర్భం దాల్చి, శిశువుకు జన్మనిస్తుంది. ఆ తర్వాత చట్టపరమైన నిబంధనలు, ముందస్తు ఒప్పందాల ప్రకారం బిడ్డ సంరక్షణ బాధ్యతలను ఉద్దేశిత తల్లిదండ్రులు స్వీకరిస్తారు. సాధారణంగా సరోగసీలో రెండు ప్రధాన విధానాలు ఉంటాయి. మొదటిది సంప్రదాయ సరోగసీ. ఇందులో గర్భాన్ని మోసే మహిళ అండం ఉపయోగించబడుతుంది. రెండోది గెస్టేషనల్ సరోగసీ. ఇందులో ఉద్దేశిత తల్లిదండ్రుల్లో ఒకరి లేదా దాత అండం, వీర్యాన్ని ఉపయోగించి ప్రయోగశాలలో పిండాన్ని తయారు చేస్తారు. అనంతరం ఆ పిండాన్ని సరోగేట్ మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ విధానంలో గర్భాన్ని మోసే మహిళకు బిడ్డతో జన్యుపరమైన సంబంధం ఉండకపోవచ్చు. స్వలింగ సంపర్కులైన ఇద్దరు పురుషులు సంతానం పొందాలనుకున్నప్పుడు గెస్టేషనల్ సరోగసీ ఒక మార్గంగా ఉంటుంది. ఇందుకోసం సాధారణంగా అండదాత సహాయం తీసుకుంటారు. వైద్య నిపుణులు ఒక పురుష భాగస్వామి వీర్యంతో దాత అండాన్ని ఫలదీకరణం చేసి పిండాన్ని తయారు చేయవచ్చు. ఆ పిండాన్ని సరోగేట్ మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. గర్భధారణ సజావుగా సాగితే ఆమె బిడ్డకు జన్మనిస్తుంది. ఈ ప్రక్రియలో బిడ్డకు జన్యుపరంగా ఒక తండ్రితో సంబంధం ఉండవచ్చు. మరో భాగస్వామి తండ్రిగా చట్టపరమైన గుర్తింపు పొందడం మాత్రం సంబంధిత దేశాలలోని చట్టాలు, తల్లిదండ్రుల గుర్తింపు విధానాలు, అవసరమైన న్యాయ ప్రక్రియలపై ఆధారపడి ఉంటుంది. అంటే సరోగసీ ద్వారా బిడ్డను పొందడం వైద్యపరమైన ప్రక్రియ మాత్రమే కాదు.. దానికి సంబంధించిన చట్టపరమైన అంశాలను కూడా ముందుగానే పరిశీలించాల్సి ఉంటుంది. జెట్టెన్, కీనన్‌లకు 2024లో నిశ్చితార్థం జరిగింది. అయితే ప్రధాని బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తమ వివాహ ప్రణాళికల్లో మార్పులు చేసుకున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఇప్పుడు తమ జీవితంలోకి కొత్త సభ్యుడు రానుండటంతో ఈ జంట ఆనందంలో మునిగిపోయింది. తమ బిడ్డ 2027లో జన్మించనున్నట్లు ప్రకటిస్తూ, తమకు సహకరించిన అండదాతకు, సరోగేట్ తల్లికి కృతజ్ఞతలు తెలిపారు. గర్భాన్ని మోస్తున్న మహిళ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కూడా వెల్లడించారు. సామాజిక సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో నెదర్లాండ్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2001 ఏప్రిల్ 1న స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసిన ప్రపంచంలోనే తొలి దేశంగా నెదర్లాండ్స్ చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఇద్దరు పురుషులు లేదా ఇద్దరు మహిళలు చట్టబద్ధంగా వివాహం చేసుకునేందుకు అక్కడ అవకాశం ఉంది.

## రాములమ్మ వ్యూహాత్మక మౌనం



హైదరాబాద్ , అక్టోబరు 23, తెలంగాణ రాజకీయాల్లో 'రాములమ్మ' విజయశాంతి పేరు వినపడితేనే ఒక రకమైన పవర్‌ఫుల్ పొలిటికల్ ఇమేజ్, పదునైన వ్యాఖ్యలు గుర్తుకొస్తాయి. వెండితెరపై లేడీ అమితాబ్‌గా ప్రసిద్ధి చెందిన ఆమె, తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రత్యర్థులపై తనదైన శైలిలో సింహగర్జన చేస్తూ వార్తల్లో నిలిచేవారు. బీఆర్ఎస్, బీజేపీలను దాటుకుని 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ గూటికి చేరిన విజయశాంతికి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించి గౌరవించింది. అయితే పదవి దక్కిన తర్వాత కూడా గతంలో కనిపించిన ఆ రాజకీయ దూకుడు, నిరంతర క్షేత్రస్థాయి చురుకుదనం ఇప్పుడు లోపించాయనే చర్చ తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా నడుస్తోంది. 2023 ఎన్నికల సమయానికి ముందు బీజేపీ వీడి హస్తం గూటికి వచ్చిన విజయశాంతికి ఎమ్మెల్సీ సీటు దక్కడంపై అప్పట్లో పార్టీలోని కొందరు సీనియర్లు, ఏళ్ల తరబడి పనిచేసిన నేతలు అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేశారనే ప్రచారం ఉంది. అయినప్పటికీ అధిష్ఠానం ఆమెకు ప్రాధాన్యత ఇచ్చి శాసనమండలికి పంపింది. అయితే పదవి లభించిన తర్వాత పార్టీ అధిష్ఠానం, పీసీసీ సమాయత్తం చేసే కీలక కార్యక్రమాలలో, నిరసనల్లో లేదా ప్రభుత్వ మైలేజ్ ప్రచారాల్లో విజయశాంతి పెద్దగా కనిపించకపోవడం గమనార్హం. పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చే ప్రధాన సభలకు కూడా ఆమె గైర్హాజరవ్వడం వెనుక అంతర్గత అసంతృప్తి ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే విజయశాంతి మౌనం అంటే ఆమె పూర్తిగా రాజకీయాలకు దూరమైనట్లు భావించడానికి వీల్లేదు. పార్టీ వేదికలపై నేరుగా మాట్లాడకపోయినప్పటికీ.. సోషల్ మీడియా ద్వారా ఆమె నిరంతరం క్రియాశీలకంగానే ఉంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పోలీసు వ్యవస్థలో సవాళ్లు వంటి సున్నితమైన ప్రజా సమస్యలపై ఆమె స్పందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ వ్యాఖ్యలు పరోక్షంగా సొంత కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనకే సూచనలు లేదా ప్రశ్నించే ధోరణిలో ఉండటం కాంగ్రెస్ శ్రేణుల్లో విభిన్న చర్చలకు దారితీస్తోంది. విజయశాంతి కేవలం ఒక సాధారణ ఎమ్మెల్సీ పాత్రకే పరిమితం కాకుండా, పార్టీలో తనకు తగినంత కార్యనిర్వాహక ప్రాధాన్యత లేదా నిర్ణయాత్మక హోదా దక్కలేదనే భావనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ యంత్రాంగంతో ఆమెకు స్పష్టమైన సమన్వయ లోపం ఉందా, లేక తనకు తానుగా ఒక డిస్టెన్స్ మెయింటెన్ చేస్తున్నారా అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారికంగా ఆమె నుంచి సమాధానం రాలేదు. దీంతో ఆమె హాజరు కాకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ముగింపుగా చెప్పాలంటే.. విజయశాంతి పాటిస్తున్న ఈ నిశ్శబ్దం కేవలం తాత్కాలిక వ్యూహాత్మక విరామమా లేక కాంగ్రెస్ పార్టీ తీరుపై నిశ్శబ్ద నిరసనా అనేది త్వరలోనే తేలనుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పదిహేను నెలల పాలన పూర్తి చేసుకుని స్థానిక పోరుకు సిద్ధమవుతున్న తరుణంలో.. రాములమ్మ మళ్లీ ఎప్పుడు తన గళాన్ని విప్పుతారు, ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోబోతున్నారు అనేది రానున్న రోజుల్లో స్పష్టత రానుంది.

## గడ్డిపోతారం పారిశ్రామికవాడలో గ్యాస్ లీక్..

### ఇద్దరు కార్మికులు మృతి



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో విషాదం చోటుచేసుకుంది. సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తెల్లవారుజామున పరిశ్రమలోని గ్లాస్ బ్లాక్‌లో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో సుదర్శన్ రావు (27), బాలాజీ (44) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికులుగా సమాచారం. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్యాస్ లీక్‌కు గల కారణాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మూడేండ్లయినా ముచ్చట లేదు..

## ఊసే లేని హనుమకొండ కొత్త బస్ స్టేషన్ నిర్మాణం



హనుమకొండ, : వరంగల్ రెండో రాజధాని అని మంత్రులు పదేపదే చెబుతున్న ప్రకటనలకు, అభివృ ద్ధిలో ప్రభుత్వ తీరుకు పొంతన కుదరడం లేదు. రవాణాలో కీలకమైన హనుమకొండ బస్ స్టేషన్ కొత్త భవనం నిర్మాణంలో కాంగ్రెస్ సర్కారు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రతి రోజూ 3 లక్షల మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండ్ కొత్త భవన నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు పూర్తవుతున్నా ఒక్క ఇటుకైనా పెట్టలేదు. దీని నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.83 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టో బర్లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. మూడేండ్లు పూర్తవుతున్నా దాని ముచ్చటే మరిచింది. పట్టించుకోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు: ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపో వడంతో హనుమకొండ బస్టేషన్ కొత్త భవన నిర్మాణ పనులు మొదలు కావడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన పనులను పూర్తి చేసే విషయంలోనూ కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తు న్నది. అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు లేదు. పాత పనులను పూర్తి చేసేందుకు మంజూరైన నిధులను విడుదల చేయడం లేదు. లక్షల మంది ప్రయాణికులతో కిక్కిరిసిపోయే హనుమకొండ బస్ స్టేషన్ ప్రస్తుతం దయనీయంగా ఉన్నది. ఎలాంటి వసతులు లేక ప్రయాణికులు ఇబ్బంది. పడుతున్నారు. మహిళా ప్రయాణికులు అవస్థలు చెప్పలేని విధంగా ఉన్నా యి. టాయిలెట్స్ వసతి లేదు. తాగునీరు అసలే ఉండడంలేదు. పండుగ సమయాల్లో రోజువారీ కంటే రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు వస్తుం టారు. బస్సుల కోసం నిల్చునేందుకు వారికి స్థలం సరిపోవడం లేదు. శిథి లావస్థలో ఉన్న ప్రస్తుత భవనానికి మరమ్మతులు చేసినా ఉపయోగం ఉండ దని, కొత్తది నిర్మిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. వాటి నిర్మాణ పనులు అస్సలు మొదలు కావడంలేదు. రద్దీ ఫుల్.. వసతులు నిల్: హనుమకొండ బస్ స్టేషన్ ప్రస్తుత భవనం 1974లో ప్రారంభ మైంది. 16 ఎకరాల విస్తీర్ణం ఉన్నా భవనం చిన్నగా ఉండడంతో రద్దీకి అనుగుణంగా వసతులు లేవు. 1990లో మరో కొత్త భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రయాణికులు వేల రెట్లు, వందల బస్సులు పెరి గాయి. పార్కింగ్ సౌకర్యం లేదు. ప్రస్తుత భవనం పెచ్చు లూడి శిథిలావస్థలో ఉన్నది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 1500 బస్సులు వేల సర్వీసులతో 3 లక్షల మంది ప్రయా ణిస్తుంటారు. పండుగ సీజన్లు? సోమవారం, శనివా రాల్లో 350 బస్సులు నడుస్తున్నాయి. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నది. వరంగల్–హైదరా బాద్ రూట్లో బస్సులు సరిపోకపోవడంతో వందల ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులు వెళు ్తంటారు. రద్దీ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక వసతు లతో బస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు చేసింది. స్మార్ట్ సిటీలో భాగంగా హనుమకొండ బస్టాండు కొత్త భవనం నిర్మించేలా ఆర్టీసీ ప్రతి పాదనలు సిద్ధం చేసింది. ఆ తర్వాత దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించింది. కొత్త భవన నిర్మాణ పనులను పట్టించుకోవడం లేదు. వసతుల లేమితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

# సిద్ధమవుతున్న టిమ్స్...

హైదరాబాద్, అక్టోబరు 23, హైదరాబాద్‌లోని సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో త్వరలో శస్త్రచికిత్స సేవలు దశలవారీగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఔట్‌పేషెంట్ సేవల ద్వారా రోగులకు వైద్యసేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి, ఇకపై ఆపరేషన్లు, అత్యాధునిక ఇన్‌పేషెంట్ చికిత్సలను కూడా అందించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది రోగులకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. ముఖ్యంగా నగరంలోని ప్రధాన ప్రభుత్వ వైద్యశాలల్లో పెరుగుతున్న రోగుల రద్దీని తగ్గించడంతోపాటు, అవసరమైన వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు ఈ విస్తరణ దోహదపడనుంది.ఆపరేషన్ థియేటర్లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తవడంతోపాటు, వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టడంతో శస్త్రచికిత్స సేవల ప్రారంభానికి మార్గం సుగమమైంది. ఆగస్టులోనే ప్రారంభమైన ఈ ఆసుపత్రికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను మరింత విస్తరించి, శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు కూడా చికిత్స అందించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.సుమారు రూ.1,126 కోట్ల వ్యయంతో 53 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో మొత్తం 1,082 పడకలు ఉన్నాయి. వీటిలో 300 పడకలను ఐసీయూ సేవల కోసం కేటాయించారు. అలాగే 31 ప్రధాన ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. భారీ వైద్య మౌలిక సదుపాయాలతో ఏర్పాటైన ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే రాష్ట్ర ప్రభుత్వ వైద్య రంగంలో కీలకమైన మార్పు వచ్చే అవకాశముంది. అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు అదనపు వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.శస్త్రచికిత్స సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆసుపత్రి మరింత ఎక్కువ సంఖ్యలో కేసులను నిర్వహించగలదని టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఏ. నరేంద్ర తెలిపారు. దీనివల్ల ప్రస్తుతం అధిక రోగుల భారాన్ని ఎదుర్కొంటున్న ఇతర ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుందని, రోగులకు సకాలంలో చికిత్స అందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అయితే, అన్ని శస్త్రచికిత్స సేవలను ఒకేసారి ప్రారంభించకుండా దశలవారీగా విస్తరించనున్నారు. ఆపరేషన్ థియేటర్లు, వైద్య బృందాలు, సహాయక విభాగాలు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్న కొద్దీ ఆపరేషన్ల సంఖ్యను పెంచనున్నారు. అదనపు ఐసీయూ పడకలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రావడం వల్ల శస్త్రచికిత్సల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఆసుపత్రి సామర్థ్యం పూర్తిగా వినియోగంలోకి వస్తే హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు కూడా మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.హైదరాబాద్‌లో వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడిగా పనిచేస్తున్న సురేశ్ చీకట్ల కుటుంబానికి గ్రామంలో 35 ఎకరాలకు పైగా భూమి ఉంది.

గత ఏడాది తమ పొలంలో సుమారు 900 బస్తాల ధాన్యం పండిందని, ఒక్కో బస్తా 40 కిలోల చొప్పున మొత్తం 405 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ.. బోరుబావుల నిర్వహణలో తీసుకున్న జాగ్రత్తలతో సుమారు 750 బస్తాల దిగుబడిని ఆశిస్తున్నట్లు చెప్పారు.

# టిబెట్‌లో భారీ భూకంపం.. పదహారు మంది మృతి

లాసా టిబెట్ లో భారీ భూకంపం సంభవించింది. ఘటనలో పదహారు మంది మృతి చెందారు. భూకంపం ధాటికి మరో 32 మందికి గాయాల పాలయ్యారు. 7.0 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతం అయింది. దేశవ్యాప్తంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. పలు భవనాలు దెబ్బతిన్నాయి. విద్యుత్, టెలికమ్యూనికేషన్ సేవలు నిలిచపోయాయి. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసారు.

## స్వర్ణకారుల శంఖారావాన్ని జయప్రదం చేయాలి

సికింద్రాబాద్ ఈ నెల హైదరాబాద్ లో జరుగనున్న స్వర్ణకారుల శంఖారావం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని విశ్వకర్మసంఘం అధ్యక్ష కార్యదర్శులు గోపాలపురం ప్రకాష్, గిర్మపురం భాస్కరాచారి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ లోని విశ్వకర్మ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో శంకారావం సభకు సంబంధించిన గోడ పత్రికను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వర్ణ కారుల సమస్యల పరిష్కారం, వృత్తి పరిరక్షణ, సంక్షేమం ధ్యేయంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 50ఏళ్లు నిండిన ప్రతి స్వర్ణకారునికి రూ 5వేల పెన్షన్ ఇవ్వాలని, జీఓ 272ని సవరించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ డిమాండ్ల సాధన కోసం సరూర్ నగర్ గ్రౌండ్స్ లో సభను జరుపనున్నట్లు పేర్కొన్నారు. స్వర్ణకారులంతా తమతమ దుఖానాలను మూసివేసి స్వచ్ఛందంగా పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని కోరారు.

# గడ్డిపోతారం పారిశ్రామికవాడ ప్రమాదంపై హరీశ్‌రావుగ్ర్భాంతి..

## మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్



సంగారెడ్డి జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ అయి ఇద్దరు కార్మికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని హరీశ్‌రావు అన్నారు. నాడు సిగాచి.. నేడు సరాక పరిశ్రమలో ప్రమాదం. గత చేదు అనుభవాల నుండి ఈ ప్రభుత్వం ఏం నేర్చుకోదా అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకుంటోందని అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు ప్రశ్నార్థకంగా మారగా, అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత వచ్చి ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప.. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు మీరు చేస్తున్నదేమిటి అని నిలదీశారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేదెప్పుడు అని కాంగ్రెస్ సర్కార్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. సరాక పరిశ్రమ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి బాధ్యులైన కంపెనీ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలన్నారు. ఉపాధి కోసం వచ్చిన అమాయక కార్మికుల ప్రాణాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సిగాచి ఘటనలో ఇంటి పెద్దను కోల్పోయిన 54 మంది కార్మిక కుటుంబాలందరికీ సీఎం స్వయంగా ప్రకటించిన కోటి రూపాయల పరిహారాన్ని ఇప్పటికైనా అందించి మాట నిలుపుకోవాలన్నారు.

# హైదరాబాద్ లో గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్

హైదరాబాద్, అక్టోబరు 23, హైదరాబాద్‌లో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి మరో కీలక చర్యకు సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నగరంలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే నిర్మాణ పనులు, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించేలా 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) యోచిస్తోంది. ఇందులో భాగంగా కోకాపేటలో ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే అవకాశాలను జలమండలి పరిశీలిస్తోంది. ఈ ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే తాగడానికి ఉపయోగించే నీటిని ఇతర పనులకు వినియోగించాల్సిన అవసరం తగ్గనుంది.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను పరిశీలించి.. పరీక్షలు నిర్వహించే విధానం, పాటిస్తున్న ప్రమాణాలు, ఫలితాలను నమోదు చేసే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు సరఫరా చేయాలంటే దాని నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని.. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించాలని అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలమండలి అధికారులతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నీటి నాణ్యతకు సంబంధించిన పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. ఈ వివరాలను హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా పర్యవేక్షించేలా వ్యవస్థను రూపొందించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి పరీక్షల వివరాలు పారదర్శకంగా ఉండటంతో పాటు అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులో ఉండేలా రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల నీటి నాణ్యతపై పర్యవేక్షణ మెరుగుపడటంతో పాటు సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే విధానంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటి నింపే పరిమితులను నిర్ణయించాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఒక్కో ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారు.. దాని సామర్థ్యం ఎంత.. వంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నిర్ణీత పరిమితికి మించి నీరు నింపకుండా నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనంగా మిగిలే నీటిని వృథా చేయకుండా సంబంధిత చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.శుద్ధి చేసిన నీటిని తాగునీటికి ప్రత్యామ్నాయంగా కాకుండా.. తాగడానికి అవసరం లేని పనులకు వినియోగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జలమండలి అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ, పార్కులు, తోటల నిర్వహణ వంటి అవసరాలకు ఉపయోగించేలా నగరప్రజలను ప్రోత్సహించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనుల్లో తాగునీరు వినియోగించే సందర్భాలు తగ్గితే నగరంలోని తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.అయితే.. ఈ శుద్ధి చేసిన నీటిని ఏయే అవసరాలకు ఎంత పరిమాణంలో సరఫరా చేయాలన్నది నాణ్యత ప్రమాణాలు, భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించాల్సి ఉంటుంది. ఫిల్లింగ్ స్టేషన్లలో నీటి నాణ్యత, సరఫరా పరిమాణం, భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని జలమండలి స్పష్టం చేసింది. కోకాపేటలో గ్రీన్ వాటర్ కేంద్రం ఏర్పాటుపై సాంకేతిక పరిశీలన కొనసాగుతుండగా.. దాని ఏర్పాటు, అమలు తేదీ, సరఫరా సామర్థ్యంపై అధికారికంగా మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## ఎస్ పి ఎఫ్ సేవలు భేష్

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




సంగారెడ్డి పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ లోని టీజీ ఎస్ పిఎఫ్ సెక్యూరిటీ అకాడమీ ఆధ్వర్యంలో 36 వ రైజింగ్ డే పేరేడ్ లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు 36 వ బ్యాచ్ టీజీ ఎస్ పిఎఫ్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి డీజీ స్వాతి లక్రా, పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సేవలు మరువలేనివి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 67 సంస్థలకు 2 వేల మందికి పైగా ఎస్ పి ఎస్ సిబ్బంది సేవలందిస్తున్నారని అన్నారు. పటిష్టమైన రక్షణ, భద్రతే అభివృద్ధికి పునాది. అలాంటి బాధ్యతలు స్వీకరించి పనిచేస్తున్న ఎస్ పి ఎఫ్ సేవలు భేష్. 35 ఏళ్లలో భద్రతా రంగంలో ఎంతో మార్పులు వచ్చాయి. కృత్రిమ మేధ, టెక్నాలజీ వంటివి ఉపయోగించి భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం చేశాం. ఎస్ పి ఎఫ్ ప్రజలతో మమేకమై, ప్రజలలో భయాన్ని కాకుండా భరోసా కల్పించాలి . దేశానికి, రాష్ట్రానికి భద్రత కల్పిస్తున్న ఎస్ పిఎఫ్ దళాలకు వారి కుటుంబ సభ్యుల మనోధైర్యం మరువలేం. జాతిగర్వపడే విధంగా ఆయుధాలతోనే కాకుండా ఆలోచనాత్మక ధోరణితో ప్రగతి పథంలో రాష్ట్రం ముందుకు సాగాలని అన్నారు.

# అమెరికన్ మార్కెట్లోకి తెలంగాణ రైస్...

హైదరాబాద్, అక్టోబరు 23, తెలంగాణలోని రైతులు పండించిన బియ్యం త్వరలో అమెరికా మార్కెట్‌లోకి అడుగుపెట్టనుంది. హనుమకొండ జిల్లా ముల్కనూర్ గ్రామానికి చెందిన రైతులు తమ బ్రాండెడ్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ రైతుల సమష్టి కృషికి ప్రతీకగా నిలిచిన ముల్కనూర్ కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ ఈ దిశగా కీలక అడుగు వేసింది. అమెరికాకు చెందిన హార్వెస్ట్‌లింక్ సహకార సంస్థతో కలిసి అక్కడి మార్కెట్‌లో తెలంగాణ సోనా, జై శ్రీరామ్ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించింది. తొలి విడతలో 25 టన్నుల బియ్యాన్ని పంపించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు లభిస్తే నెల రోజుల్లో తొలి సరుకు అమెరికాకు చేరే అవకాశం ఉంది.ముల్కనూర్ గ్రామంలో రైతులకు వ్యవసాయానికి అవసరమైన అనేక సేవలు ఒకే చోట అందుబాటులో ఉండటం ఈ సహకార సంఘం ప్రత్యేకత. విత్తనాలు, ఎరువుల నుంచి వ్యవసాయ పరికరాలు, పంట రుణాలు, దిగుబడుల నిల్వ, మార్కెటింగ్ వరకు రైతులకు అవసరమైన సదుపాయాలను ఈ సంఘం కల్పిస్తోంది. 1956లో కేవలం 373 మంది సభ్యులతో, రూ.2300 వాటా మూలధనంతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం 7500 మందికి పైగా సభ్యులతో అభివృద్ధి చెందింది. రైతులే సభ్యులుగా, యాజమాన్య భాగస్వాములుగా వ్యవహరిస్తుండటంతో సంస్థ కార్యకలాపాల్లో వారికి ప్రత్యక్ష భాగస్వామ్యం లభిస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఈ సంఘంలో నిరర్థక ఆస్తులు దాదాపు జీరో స్థాయిలో ఉండగా.. ఉద్యోగుల్లో సుమారు 90 శాతం మంది రైతు కుటుంబాలకు చెందినవారే కావటం విశేషం.గ్రామానికి చెందిన 45 ఏళ్ల రైతు బొల్లంపల్లి కుమారస్వామి కుటుంబం మూడు తరాలుగా ఈ సహకార సంఘంతో అనుబంధం కలిగి ఉంది. మూడు ఎకరాల భూమి ఉన్న ఆయన సంఘం పాలకవర్గంలోనూ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. రైతులు దళారులపై ఆధారపడకుండా.. వ్యవసాయ అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే పరిష్కారాలు పొందుతున్నారని ఆయన తెలిపారు. సంఘానికి సొంత గోదాములు ఉండటంతో పంట నాణ్యతను కాపాడుకోవడంతోపాటు, నిల్వ సదుపాయాలను వినియోగించుకునే అవకాశం ఉందని వివరించారు.పంట సాగుకు ముందే రైతులకు విత్తనాలు అందించడం, పంట చేతికొచ్చిన తర్వాత దిగుబడులను కొనుగోలు చేయడం ఈ సంఘం ప్రధాన సేవల్లో భాగం. కనీస మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.200 నుంచి రూ.400 వరకు బోనస్ కూడా అందిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పంట నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలించడం, నిల్వ సదుపాయాలు కల్పించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌కు అందించేందుకు సహకరిస్తోంది. పంట రుణాలను సుమారు 7 శాతం వడ్డీతో, మధ్య, దీర్ఘకాలిక రుణాలను 10 శాతం వడ్డీతో అందిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రుణాల మంజూరులో ఒకరోజులోనే ప్రక్రియ పూర్తయ్యే సదుపాయం ఉందని కుమారస్వామి తెలిపారు. వ్యవసాయ రుణాలతోపాటు పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇతర అవసరాలకూ ఆర్థిక సహకారం అందుతోందని చెప్పారురైతుల సమష్టి భద్రతకు సహకార వ్యవస్థ మంచి మార్గమని పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పథకాలు కొంత ఆర్థిక సాయం అందించినప్పటికీ దీర్ఘకాలిక భరోసా కల్పించడంలో రైతు సహకార సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో తెలంగాణ సోనా, జై శ్రీరామ్ వంటి బ్రాండ్లతో బియ్యం విక్రయిస్తున్న ముల్కనూర్ సంఘం ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌పై దృష్టి సారించిందని చెప్పారు. అమెరికాలోని భారతీయులు, ముఖ్యంగా తెలుగు ప్రజల నుంచి డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తు?నారు. విదేశీ మార్కెట్లలో దేశీయ ధరల కంటే 10 నుంచి 15 శాతం అధిక ధర లభించే అవకాశం ఉందని సంఘం భావిస్తోంది. ఎగుమతులు విజయవంతమైతే ముల్కనూర్ రైతులకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి రావడంతోపాటు, సహకార వ్యవసాయ సంఘానికి అంతర్జాతీయ గుర్తింపు లభించే అవకాశం ఉంది

# టెంపుల్ టూరిజం రెడీ అవుతన్న రోప్ వే...

హైదరాబాద్, అక్టోబరు 23, తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని ఐదు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఆధునిక రోప్‌వేలునిర్మించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతిష్టాత్మక 'పర్వతమాల' పథకం కింద సుమారు రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ రోప్‌వేలు అందుబాటులోకి వస్తే కొండలు, లోయలు, అడవుల అందాలను ఆకాశమార్గంలో రోప్‌వేల ద్వారా కేబుల్ కార్లలో ప్రయాణిస్తూ వీక్షించే అవకాశం పర్యాటకులకు లభిస్తుంది.ఈ ప్రాజెక్టులో ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునకొండకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో విజయపురి నుంచి లాంచీల ద్వారా మాత్రమే కొండపైకి చేరుకోవాల్సి వస్తోంది. నీటిమట్టం తగ్గడం, ప్రతికూల వాతావరణం కారణంగా ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోప్‌వే నిర్మాణంతో కృష్ణానది అందాలు, నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆకాశమార్గంలో వీక్షించే అవకాశం ఏర్పడనుంది.యాదగిరిగుట్టలోని పెద్దగుట్ట టెంపుల్ సిటీ నుంచి ప్రధాన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర రోప్‌వే ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది అమల్లోకి వస్తే భక్తులకు ప్రయాణ సౌకర్యం మెరుగుప ✓డటంతోపాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది. అంతేకాక.. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు తేలికగా కొండపైకి చేరుకునే అవకాశం లభిస్తుంది.కొరియర్ బుక్ చేయండిపెద్దపల్లి జిల్లాలోని చారిత్రక రామగిరి కోటకు కూడా రోప్‌వే నిర్మించనున్నారు. కొండ పాదం నుంచి కోట శిఖరం వరకు సుమారు 2.1 కిలోమీటర్ల మేర కేబుల్ కార్ల సదుపాయం కల్పించాలని ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం దట్టమైన అడవులు, రాతిబాటల గుండా ట్రెక్కింగ్ చేస్తూ కోటపైకి చేరుకోవాల్సి వస్తోంది. రోప్‌వే అందుబాటులోకి వస్తే కాళేశ్వరం, మంథని, రామగిరి ప్రాంతాలను కలిపి పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది.నల్లగొండలోని హనుమాన్ హిల్ నుంచి సమీప గుట్ట వరకు 1.2 కిలోమీటర్ల మేర పర్యావరణహిత కేబుల్ కార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది పట్టణ ప్రజలకు కొత్త పర్యాటక ఆకర్షణగా మారనుంది.నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఖిల్లా రామాలయానికి రోప్‌వే ఏర్పాటు మరో ముఖ్యమైన ప్రాజెక్టు. అద్భుతమైన రాతి శిల్పకళతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని చేరుకోవడానికి ప్రస్తుతం 150కిపైగా నిటారైన మెట్లు ఎక్కాల్సి వస్తోంది. కొత్త సదుపాయం అందుబాటులోకి వస్తే వృద్ధులు, మహిళలు, ఇతర భక్తులకు దర్శనం సులభతరం కానుంది. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది. ఈ ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) రూపకల్పన, తదుపరి అనుమతుల ప్రక్రియ కీలకం కానుంది.రాష్ట్రంలో ఇప్పటికే భువనగిరి ఖిల్లా, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పుడు మరో ఐదు ప్రాంతాలకు కొత్త ప్రాజెక్టులు తోడైతే తెలంగాణలో ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి పర్యాటకానికి మరింత ప్రాధాన్యం పెరగనుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి, 15 మందికి పైగా గాయాలు

ఛత్తీస్‌గఢ్: మనేంద్రగఢ్?కేల్హరి మార్గంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 30 నుంచి 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు, పహాడీహంస్వాహి సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 15 మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సహాయక సిబ్బంది స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ప్రయాణికుల కుటుంబాల్లో విషాదం నెలకొంది.

## తెలుగు రాష్ట్రాల్లో 15 చోట్ల ఈడీ మెరుపు దాడులు..
### ఆన్‌లైన్ బెట్టింగ్, హవాలా గ్యాంగ్‌లపై ఫోకస్

విజయవాడ, అక్టోబరు 23, తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మరోసారి మెరుపు దాడులు చేశారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద నమోదైన కేసుకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో హైదరాబాద్, విజయవాడ సహా ఇరు రాష్ట్రాల్లోని మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలోని పూణే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు వేగవంతం చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, మోసపూరిత ఇన్వెస్టిమెంట్ యాప్‌ల ద్వారా సామాన్యులను ఆకర్షించి వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన అంతర్రాష్ట్ర ముఠాలను లక్ష్యంగా చేసుకుని ఈ సోదాలు నిర్వహిస్తున్నారుగత వారం ఉత్తరాదిలోని ఢిల్లీ, ముంబై, గుర్గావ్ నగరాల్లో ఈడీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సోదాల్లో లభించిన కీలక సమాచారం, లింకుల ఆధారంగానే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ఏజెంట్లు, హవాలా ఆపరేటర్లపై ఈడీ అధికారులు ఫోకస్ చేశారు. నిందితులు బెట్టింగ్ ద్వారా సేకరించిన సొమ్మును షెల్ కంపెనీలు, క్రిప్టోకరెన్సీల మార్గం ద్వారా విదేశాలకు అక్రమంగా తరలించినట్లు ఈడీ ప్రాథమిక విచారణలో గుర్తించింది.ప్రస్తుతం కీలక నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తూ రికార్డులు, ఆర్థిక లావాదేవీల పత్రాలు, డిజిటల్ పరికరాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఆధారాలు, హవాలా నెట్‌వర్క్ నెరిపిన పత్రాలు లభ్యమైనట్లు సమాచారం. నిందితుల అక్రమ లావాదేవీల తీగ లాగితే మరిన్ని సంచలనాత్మక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# పదవుల కోసం... వెయిటింగ్.... ఇంకెన్నాళ్లు...

హైదరాబాద్, అక్టోబరు 23, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉంది. గడచిన మూడు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తుంది. కానీ ఇప్పటికి ఆ పార్టీలో జాప్యం.. నిర్లక్ష్యం.. కొనసాగుతూనే ఉన్నాయి.. అసలు ఈ పరిస్థితికి కారణమెవ్వరు.. ఇలానే కొనసాగితే వచ్చే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాగలుగుతుందా.. అసలు ఇంతటి జాప్యం ఎందుకు జరుగుతోంది.. ఇవే ప్రశ్నలు ఇప్పుడు ఆ పార్టీ క్యాడర్లో వినిపిస్తున్నాయి.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్.. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు.. కేడర్ కోసం కల్పించాల్సిన అవకాశాల మీద భేటీ నిర్వహించారు. ఎప్పటి మాదిరిగానే భారీ జెండాను తెర ముందుకు తీసుకొచ్చారు. పార్టీ కమిటీ లో నియామకాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ ల పదవులకు గడువులు ముగియడంతో.. రెన్యువల్ చేయాలని అనుకున్నారు.. ఖాళీ అయ్యే గవర్నర్ కోట ఎమ్మెల్సీలను భర్తీ చేయాలని భావించారు.. సీఎం చాలా విస్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో.. ఇవన్నీ కూడా అమలు అవుతాయని అందరూ అనుకున్నారు. కానీ, ఇవి చర్చలకే పరిమితమవుతాయని.. ఏదో అప్పటికప్పుడు సమావేశాలలో నిర్ణయాలు తీసుకుంటారని.. త్వరలోనే భర్తీ చేస్తామని ప్రకటిస్తారని.. ఆ తర్వాత అడుగు కూడా ముందుకు వేయాలని కార్యకర్తలు చెబుతున్నారు.కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారులకు వచ్చి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ పదవుల భర్తీ వ్యవహారం ఇప్పటికీ పూర్తికాలేదు. ఇది ఎప్పటికీ పూర్తికాని ఒక సమస్య లాగా మిగిలిపోయింది. నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం అనేకసార్లు కమిటీలను నిర్ణయించారు అనేక పర్యాయాలు అంతర్గత చర్చ జరిపారు. అధిష్టానం వద్దకు జాబితాలు పంపించారు. అవన్నీ కూడా పంపించినంత వేగంతో వెనక్కి వచ్చేశాయి. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు చాలామంది కార్యకర్తలు కేసులు ఎదుర్కొన్నారు. డబ్బులు ఖర్చు పెట్టుకున్నారు. పోలీస్ దెబ్బలు కూడా తిన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందని వారు భావించారు. కానీ ఇంతవరకు ఎలాంటి ఉపశమనం కార్యకర్తలకు లభించలేదు. ఒకవేళ కొంతమందికి పదవులు ఇస్తే.. మిగతావారు పార్టీకి దూరమవుతారని.. అసంతృప్తిని రాజేస్తారని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందువల్లే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి ఇంతకాలం వేచి చూస్తూ ఉందని సమాచారం.సంస్థ గత నియామకాలు మాత్రమే కాదు వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా భావిస్తున్నారు. కానీ పార్టీలో కిందిస్థాయి నాయకులలో ఆ స్థాయిలో కదలిక ఏమాత్రం కనిపించడం లేదు. పట్టభద్రులలో ప్రభుత్వం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి ఉంది. ప్రత్యర్థులు రచిస్తున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కొనే స్థాయి పార్టీకి ఉన్నట్టు కనిపించడం లేదు. గవర్నర్ కోట ఎమ్మెల్సీ సీట్ల భర్తీ కోసం ఇప్పటికే చాలామంది నాయకులు ఢిల్లీలో పైరవీలు చేస్తున్నారు. ఆశావహులు కూడా ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇన్ని రకాల పరిణామాలు జరుగుతున్నప్పటికీ ఒక్క స్థానం విషయంలో కూడా అధిష్టానం ఏకాభిప్రాయాన్ని ప్రదర్శించలేకపోతోంది..వాస్తవానికి ఒక నిర్ణయం తీసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీలో అనేక రకాలుగా మంతనాలు జరుగుతాయి. సీఎం చేతిలో అధికారం ఉండదు. పీసీసీ అధ్యక్షుడు నిర్ణయాన్ని తీసుకోలేడు. మంత్రులు చెప్పినప్పటికీ మాట చెల్లుబాటు కాదు. మిగతా ప్రజా ప్రతినిధుల విషయంలో కూడా ఇలానే జరుగుతుంది. ప్రతి దానికి అధిష్టానం మాత్రమే ఆమోదముద్ర వేయాలి.. దీనికి తోడు ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ.. హై కమాండ్ ఇలా రకరకాల షరతులు కాంగ్రెస్ పార్టీలో ఉంటాయి. అందువల్లే ఏది త్వరగా అమలు కాదు. ఆచరణలో పడదు. అందువల్లే ఈ సుదీర్ఘ ప్రక్రియ కాంగ్రెస్ పార్టీని నిలిపివేస్తోంది.

అధికారులు ఉన్నప్పటికీ నిర్ణయాధికారం లో దూకుడుతనం లేదు. ప్రతి సమస్యను పరిష్కరించకుండా వదిలేయడం.. కాలయాపన చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది. ఇలానే జరిగిపోతే మాత్రం ఈ దసరా కాదు.. వచ్చే దసరాకు కూడా పదవుల భర్తీ కాంగ్రెస్ పార్టీలో పూర్తికాదు.

## 43వ వార్డులో హోరెత్తిన యు మూడో రోజు జనసేన పార్టీ ఎన్నికల ప్రచారం

విశాఖపట్నం జీవీఎంసీ అ 43వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థి కందుల నళిని దేవి మూడో రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను వింటూ, వార్డు అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగారు. ప్రజలతో మమేకమవుతూ నిర్వహించిన ఈ పర్యటనలో స్థానికులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి ఆకాంక్షలను తెలుసుకున్నారు.వార్డు అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కందుల నళిని దేవి గారు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు

## బియ్యం దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు...

### అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
### జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 23:జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్, చర్చి కాంపౌండ్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం వ్యాపారుల దుకాణాల్లో డిప్యూటీ తహాశీల్దార్లతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు.



తనిఖీల్లో భాగంగా, వ్యాపారులు సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల నుండి కొనుగోలు చేసిన బియ్యానికి సంబంధించిన బిల్లులు, వే బిల్లులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ప్రతి దుకాణం ప్రధాన ద్వారం వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల పరిమాణం, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని వ్యాపారులను ఆదేశించారు. బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించడం గానీ, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం గానీ చేయరాదని జిల్లా పౌరసరఫరాల అధికారి స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# జవహర్ నగర్ డంపింగ్ యార్డును తరలించాలన్న డిమాండ్ పై సన్నాహక సమావేశం

## 25 న రౌండ్ టేబుల్ సమావేశం

## 27 నుండి పాదయాత్ర

హైద్రాబాద్ అక్టోబర్ 23:జవహర్ నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ మెడిచల్ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తలపెట్టిన పాదయాత్ర పై శుక్రవారం దమ్మాయగూడలో సన్నాహక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీజేఎల్పీ నాయకులు, నిర్మల్ శాసనసభ్యులు మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ





చెత్త నిర్వహణ సరిగా చేయకుంటే ఆ ప్రాంతమే కాదు.. హైదరాబాద్ నగరానికి ముంపు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్య కొలిక్కి వచ్చే వరకు వదిలేది లేదంటున్న ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.ఉపేక్షిస్తే బరిగీసి కోట్లాడతాం అని హెచ్చరించారు.

ప్రజలందరూ కలిసి రావాలని పిలుపు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీజేఎల్పీ నాయకులు, నిర్మల్ శాసనసభ్యులు మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా

ఈటల రాజేందర్ మాట్లాడుతూ

ఈ ప్రాంతంలో ఉన్న వారంతా కడు బీదరికంలో ఉన్న వారు.

కీసర, ఘట్కేసర్, దమ్మాయి గూడలో ఇంకా వ్యవసాయం చేస్తున్నారు.

-రేవంత్ రెడ్డి మీరు ఇక్కడ ఎంపీగా ఉన్నారు.. కానీ అర్ధం మీరు చూపిస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ బూటకం- ఈ లిచర్డ్ నీళ్ల వల్ల చెరువుల్లో చేపలు చచ్చిపోతున్నాయి.- మహిళలకు గర్భ స్రావం జరుగుతుంది అని చెప్తుంటే దుఃఖం వస్తుంది.

-12 మిలియన్ టన్నుల మీథేన్ గ్యాస్ విడుదల అవుతుంది.12 లక్షల కార్లు విడుదల చేసే పొల్యూషన్ కంటే ఎక్కువ కాలుష్యం వస్తుంది. - కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ కాలుష్య- దీనివల్ల హైదరాబాద్ నగర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని రిపోర్ట్స్ వస్తున్నాయి.- ఈ విషయం గురించి నేను పార్లమెంట్లో మాట్లాడిన. కేంద్ర మంత్రి కట్టర్ గారిని కలిస్తే రాష్ట్ర ప్రభుత్వం రిపోర్ట్ తో రండి అన్నారు. - నా పుట్టుకనే పోరాటం కోసం.. రాజీపడేది లేదు.

-ప్రశ్నించే గొంతుక అని రేవంత్ రెడ్డికి ఓటు వేస్తే.. దానిని మెట్టుగా వాడుకున్నారే తప్ప ఈ ప్రాంతం వైపు తొంగి చూడలేదు.

-కేసీఆర్ కి ఓటు వేస్తారని ఎతీం బ్రమపడుతుంది.

-ప్రజల మధ్య ఉండి పోరాటం చేస్తున్న బీజేపీ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

హైడ్రా తీసుకువచ్చి రేవంత్ రెడ్డి పేదల గూడు లేకుండా చేశారు. ఇళ్ల సామాన్లు డోజర్లతో తొక్కించారు.

బ్లాక్ మెయిలింగ్ చేసి డబ్బులు సంపాదించుకున్నారు.- మేము చేసిన పోరాటం వల్లనే ఆ హైడ్రా ఆగడాలు ఆగాయి. ఇంకా ఆగాలి.

మూసీలో కొబ్బరినీళ్ల లాంటి నీళ్లు పారిస్తే మాకేం అభ్యంతరం లేదు.. అందుకోసం అటు ఇటు ఇళ్లను కూలగొట్టవద్దు అని అక్కడ పడుకొని ఇల్లు కూలగొట్టకుండా ఆపగలిగినం.

22 ఏ తెచ్చి పాత అపార్ట్మెంట్లు నిషేధిత జాబితాలో పెట్టినప్పుడు బీజేపీ అసెంబ్లీ బయట లోపలా పోరాటం చేసింది.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల 30 కిలోమీటర్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

-గర్భస్రావాలు, క్యాన్సర్లు , అక్యూట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ వచ్చి చచ్చిపోతున్నారు. అయినా ఇక్కడ ఉన్న వారు పేదవారు కాబట్టి ఇక్కడే ఉంటున్నారు. ప్రభుత్వాలు పని చేయాల్సింది ఇలాంటి పెదవారికోసమే అని రేవంత్ రెడ్డి మర్చిపోవద్దన్నారు.

ఈ సమావేశం లో

బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎస్ మల్లారెడ్డి , ఎస్ టి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, రంగా రెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ కాంటెస్టెడ్ యంఎల్ ఏ సుదర్శన్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే, యం బి సి మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ రూరల్ మేడ్చల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు సామా రంగా రెడ్డి, మాజీ మునిసిపల్ ఛైర్మెన్ చంద్ర రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ కే శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, తిర్మల్ రెడ్డి, తీరపతి యాదవ్,బీజేపీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యాలయం కార్యదర్శి గాలి సంపత్ యాదవ్, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి, ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దేవేందర్, జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, శామీర్పేట్ మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ బాబు, జవహర్ నగర్ మాజీ ఎంపిటీసి రషీదా బేగం, కాంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ ఆనంద్,అధిక సంఖ్య లో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు అభినందనలు తెలుపుతున్న మీర్పేట్ జి హెచ్ ఎం సి సోషల్ మీడియా కన్వీనర్ బావోజు సిద్దేశ్వర చారి

హైద్రాబాద్ అక్టోబర్ 23:ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాక సమావేశం కి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి వర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ఘన స్వాగతం పలికిన మీర్పేట్ జి హెచ్ ఎం సి సోషల్ మీడియా కన్వీనర్ ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ వోజు సిద్దేశ్వర చారి.ఈ సందర్భంగా శ్రీధర్ బాబుకు శాలువా కప్పి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## నామినేషన్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు

రాయచోటి, అన్నమయ్య జిల్లా పరిధిలోని కలకడ, సంబేపల్లి, ఎల్.ఆర్.పల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సంబంధిత అధికారులు, పోలీసు అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటితో ముగియనున్న నేపథ్యంలో రామాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లు, కేంద్రం వద్ద భద్రతా చర్యలను సమీక్షించారు.నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని పోలీసు సిబ్బందికి సూచించారు.ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ప్రకృతిని అందించాలి.

### వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ 6వ వార్డులో ఘనంగా వన మహోత్సవం ప్రారంభం..

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 23:వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.



వన మహోత్సవం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, కాలుష్యాన్ని తగ్గించడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, వార్డు ప్రజలు దేవభక్తుని రవీంద్ర, లగడపాటి ప్రభాకరరావు ప్రభాకర్ రావు, తోటకూర శ్రీకాంత్, విజయలక్ష్మీ, కల్పన, సుశీల, లక్ష్మీరాజ్యం, కృష్ణవేణి, సంధ్య, ఉప్పలమ్మ, ఆర్పీ ఫాతిమా, లక్ష్మణరావు, జవాన్ శ్రీను, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఈ పరీక్ష వాయిదా వేయాలి: ఆర్. కృష్ణయ్య డిమాండ్



హైద్రాబాద్ అక్టోబర్ 23 :టీజీపీఎస్సీ నిర్వహించనున్న ఏఈఈ (ఆర్ అండ్ బీ) పరీక్షను వారం రోజుల పాటు వాయిదా వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. నవంబర్ 6, 7 తేదీల్లో ఏఈఈ పరీక్షలు జరగనుండగా, నవంబర్ 6న ఎస్-ఎస్సీ జూనియర్ ఇంజినీర్ పరీక్ష కూడా ఉందని తెలిపారు. ఒకే తేదీన పరీక్షలు నిర్వహిస్తే నిరుద్యోగులు ఏదో ఒక పరీక్షకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్ లోని బీసీ భవన్లో ఓయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య ఈ అంశంపై మాట్లాడారు. ఈ నెల 26న కూడా పీసీబీ రాష్ట్రస్థాయి పరీక్ష, ఆర్ఆర్బీ పరీక్షలు ఒకే రోజున ఉండటంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నష్టం కలగకుండా ప్రభుత్వం స్పందించి, ఏఈఈ పరీక్షను వారం రోజుల పాటు వాయిదా వేయాలని కోరారు.

ఈ సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బీసీ సంఘం అధ్యక్షుడు సి. రాజేందర్, యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, అల్లంయాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి

### భూముల రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్లు పర్యవేక్షించాలి
### భూముల పట్టాదారులకు సమాచారం ఇవ్వాలి
### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ -23(ప్రజాబలం ప్రతినిధి)రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూభారతి దరఖాస్తులు, భూముల రీ సర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.భూముల రీ సర్వేలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల్లో ఇప్పటివరకు సర్వే చేపట్టిన గ్రామాల వివరాలు మొత్తం ప్రక్రియ తదితర అంశాలపై ఆరా తీశారు.





అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... భూభారతి దరఖాస్తులనుపరిష్కరించాలని, భూముల రీ సర్వే నీ రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న సర్వే సమాచారాన్ని పట్టాదారులకు ఇవ్వాలని సూచించారు. పట్టాదారుల సమక్షంలో భూముల సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డిప్యూటీ తహసీల్దార్, సర్వే యర్, జీపీఓ లతో టీం ఏర్పాటు చేసి సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను తహసీల్దారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని స్పష్టం చేశారు లైసెన్స్ సర్వేయర్లతో ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తూ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక సహకార సంఘంలో మరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్ సత్యనారాయణ గౌడ్



**మెదక్ జిల్లా కొల్చారం మండలంప్రజాబలం ప్రతినిధి** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ దేవి సింగ్ అధ్యక్షతన కొనుగోలు కేంద్రాన్ని లాంచనాలతో కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రజాప్రతినిధుల రైతుల మధ్య



ప్రారంభించడం జరిగింది ప్రభుత్వం చేపట్టిన నిబంధనలను రైతులకు క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం 24 61 ధర సాధారణ రకానికి 24 41 ధరను కేటాయించడం జరిగింది ప్రభుత్వం కేటాయించిన సన్న రకాలలో ఏడు రకాల వడ్లకు 500 బోనస్ రూపంలో ఇవ్వడం జరుగుతుందన్నారు తేమ శాతం 17 కు మించరాదని కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు రైతులకు తెలిపారు ఈ కార్యక్రమంలో



ఉపసర్పంచ్ నాయిని వెంకట నరసింహులు పిఏసిఎస్ ఉపాధ్యక్షులు గంపల లక్ష్మయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్న రాయన్న లక్ష్మయ్య పంచాయతీ కార్యదర్శి మౌనిక కొనుగోలు కేంద్రం ఇన్చార్జులు గొల్ల పాండరి చందర్ నాయక్ వార్డు సభ్యులు గంగ స్వామి మధులత కుమారస్వామి ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ నాయకులు నాయిని విట్టల్ దాసు నర్సింలు ఏగొండ రైతులు తదితరులు పాల్గొన్నారు

## శంకరాజుపల్లిలో అభివృద్ధి పనుల జోరు..
## కేకే గూడెం కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం!

### సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క సహకారంతో గ్రామాభివృద్ధికి పెద్దపీట! రూ.2.45 కోట్ల నిధులతో శంకరాజుపల్లిలో ముమ్మరంగా అభివృద్ధి పనులు!

**ఏటూరునాగారం, అక్టోబర్ 23:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, 6వ వార్డు సభ్యురాలు తాటి శ్రీలత--నీలాద్రి సమక్షంలో కేకే గూడెం కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కాలనీలో మురుగునీటి సమస్యలను పరిష్కరించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ పనులు ఎంతగానో దోహదపడనున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తగ్గి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం కలగనుంది. శంకరాజుపల్లి గ్రామ అభివృద్ధి కోసం ఎస్సీఎస్డిఎఫ్సి(రాణఖీజ) అభివృద్ధి



నిధుల కింద రూ. 1.95 కోట్లు, ఐటీడీఏ నిధుల కింద రూ. 50 లక్షలు కలిపి మొత్తం రూ. 2.45 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మాణిక్‌రావు



**జహీరాబాద్, అక్టోబరు 23 ప్రజాబలం ప్రతినిధి:** దసరా పండుగను పురస్కరించుకొని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితర బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, మాజీ ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, జహీరాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, కోహిర్ మండల అధ్యక్షుడు నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నార్సింగి మున్సిపల్ సర్కిల్ 45 కార్యాలయాన్ని మణికొండకు తరలించాలి !

**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 23 అక్టోబర్ 2026** మణికొండలో పద్దెనిమిదన్నర (18.5) కోట్ల ప్రజాధనంతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని 2025 నవంబర్‌లో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు మణికొండ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంగా ప్రారంభించారు, తదనంతరం మణికొండ మున్సిపాలిటీ కాస్తా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడంతో నార్సింగి మున్సిపల్ సర్కిల్ 45 డిప్యూటీ కమిషనర్ కార్యాలయంగా కొన్ని రోజులు వినియోగించారు. అకారణంగా గత 10 నెలలుగా కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో




వినియోగించ కుండా ఉండడం వింతగా గోచరిస్తుంది, క్రొత్తగా కట్టిన కార్యాలయంను ప్రస్తుత తరుణంలో గత రెండు నెలలుగా పడావుకు పెట్టి సదుపాయాల కొరతతో ఉన్న నార్సింగి భవనంలో కార్యాలయంను కొనసాగిస్తున్నారు పర్యవసానంగా సరిపడా స్థలం, పార్కింగ్ సదుపాయం, తగినన్ని మరుగుదొడ్లు లేనందువలన కార్యాలయ సిబ్బంది, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 18.5 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన మణికొండలోని నూతన భవనం సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నను, అట్టి భవనం ఖాళీగా పెట్టడానికి కారణమేమిటి ? ప్రస్తుత కార్యాలయంలో మౌలిక సదుపాయాల కొరత ఉన్నప్పటికీ, నూతన భవనాన్ని ఎందుకు వినియోగించడం లేదు ? దరిమిలా ప్రజాధనం వృథా కాకుండా, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు, ప్రజాభి ప్రాయన్ని గౌరవిస్తూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నార్సింగి మున్సిపల్ సర్కిల్ 45 కార్యాలయాన్ని తక్షణమే ప్రజల సౌకర్యార్థం మణికొండకు తరలించాలని భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## మర్పల్లి నాయకులు కేటీఆర్, సబితమ్మను కలిసిన మాజీ జెడ్పిటిసి మధుకర్, రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 23 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల నాయకులు మాజీ జెడ్పిటిసి మధుకర్ మాజీ మర్పల్లి మండల అధ్యక్షు లు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ప్రేమ పూర్వకంగా జంబి పెట్టి పుష్పగుచ్చాలు అందించి హృదయపూర్వక వందనాలు తెలియజేసినట్టు తెలిపారు



ప్రజా సేవలో ఉంటూ ప్రజా సంక్షేమం కోరే తెలంగాణ ముద్దుబిడ్డ లేతమ నాయకులు కల్వకుంట్ల తారక రామారావు మరియు తెలంగాణ చేవెళ్ల చెల్లమ్మ అయినా సబిత అమ్మ గారిని కలవడం జరిగిందని మర్పల్లి సీనియర్ నాయకులు మోమిన్పేట్ సీనియర్ నాయకులు కలవడంజరిగిందని సంతోషమే వ్యక్తపరిచారు

## ములుగు బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్ వర్మ పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న బి ఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 మంగపేట** ములుగు జిల్లా మంగపేట మండలం అక్కినేపల్లి మల్లారం గ్రామంలోని ములుగు జిల్లా సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్ వర్మ గారి జన్మదినం సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పార్టీ కుటుంబ సభ్యులు వర్మ ఇంటికి వెళ్లి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం జరిగింది

పుట్టినరోజు సందర్భంగా బాడిశ నాగ రమేష్ శ్రీధర్ వర్మ కు శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు

ఈ కార్యక్రమంలో మండల పిఏసిఎస్ డైరెక్టర్ సిద్ధంశెట్టి లక్ష్మణరావు, మండల సీనియర్ నాయకులు కర్రి శ్రీను, వివిధ గ్రామల అధ్యక్షులు తుక్కాని శ్రీనివాస్ మునిగల సాంబులు, కొమరం పుల్లారావు, రూప భద్రయ్య, పార్టీ నాయకులు సాంబశివరావు, మూగల రమేష్ సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు

### ప్రభాస్ బర్త్‌డే హంగామా

హైదరాబాద్ పాన్ ఇండియా' అనే పదానికి నిలువెత్తు రూపంగా మారిన రెబెల్ స్టార్ ప్రభాస్ ప్రభాస్ ఈరోజు అక్టోబర్ 23న తన 47వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. దీంతో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వద్ద అర్ధరాత్రి వేల సంఖ్యలో అభిమానులు చేరుకుని బర్త్‌డే హంగామా సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఉన్న ఆయన అభిమానులు గురువారం రాత్రి నుంచే పుట్టినరోజు సంబరాలను పండగలా ప్రారంభించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ప్రభాస్ నివాసం వద్ద అర్ధరాత్రి 12 గంటల ముందే వేల సంఖ్యలో అభిమానులు క్యూ కట్టారు. డార్లింగ్ ఫ్లాగ్‌లు, భారీ కటౌట్లతో జూబ్లీహిల్స్ వీధులన్నీ ప్రభాస్ నినాదాలతో హోరెత్తిపోయాయి. కొంతమంది అభిమానులు ఏకంగా కదులుతున్న ట్రక్కులపై నిలబడి ఫ్లాగ్‌లు ఊపుతూ సందడి చేయగా, అభిమానులు బ్లోటార్చ్‌లు, బైక్ ఇంజన్ల శబ్దాలతో వినూత్నంగా వేడుకలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### కందూరు పెద్దవాగు నీటికోసం మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర

మహబూబ్ నగర్ కేఎల్ఐ నుండి కందూరు పెద్దవాగులోకి నీళ్లు వదలాలని డిమాండ్ చేస్తూ దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాదయాత్ర మొదలుపెట్టారు. మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం నిజాలపూర్ గ్రామం పెద్దవాగు నుండి ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాదయాత్ర ప్రారంభం అయింది. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 కంటే ముందు పెద్దవాగు పూర్తిగా ఎండిపోయింది.. కృష్ణా నీళ్లను పెద్దవాగులో పారించాం. పదేళ్ల పాటు కళకళలాడిన పెద్దవాగు ఇప్పుడు కాంగ్రెస్ వైఫల్యంతో మళ్లీ ఎండిపోయిందని ఆరోపించారు.

# వారసత్వ సంపద పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి

## రామప్పలో 12 రోజుల ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం

## సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 పాలంపేట** తెలంగాణ పర్యాటక శాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం--2026 కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు ఈ 12 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.




ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి పలు అంశాలను తెలుసుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. చారిత్రక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ, శిబిరం నిర్వహణకు పర్యాటక శాఖ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. పర్యాటక పోలీసుల ద్వారా భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు.రామప్పకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రామప్పకు గుర్తింపు సాధించడంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేసిన కృషి, పోషించిన పాత్రను కార్యక్రమంలో వివరించారు.

ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, ఆలయ పూజారులు ఉమాశంకర్, హరిశంకర్, పర్యాటక శాఖ సిబ్బంది, పర్యాటక పోలీసులు, దేవస్థానం సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

శిబిరంలో కల్పించే సౌకర్యాలు, విద్యార్థులు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించవచ్చని తెలిపారు.

# 11వ రోజు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 ములుగు** రాష్ట్రవ్యాప్తంగా జాతి ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈనెల 13 నుంచి 31 వరకు సమ్మె సైరన్ మోగించారు 10వ రోజు డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో సమ్మెను ప్రారంభించారు రాష్ట్రమంతటా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ప్రధాన కూడలి వద్ద టెంట్లు ఏర్పాటు చేసుకుని వారి సమస్యల పరిష్కారానికై సమ్మెను ఏర్పాటు చేశారు 13 నుంచి ఇప్పటికి పది రోజుల నుంచి నిరవాదిక సమ్మె చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారు ప్రభుత్వం వెంటనే మా సమస్యలను పరిష్కరించాలని ఎన్ హెచ్ ఎం లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పర్మినెంట్ చేయాలని అలాగే పెరిగిన జీతాలు వెంటనే విడుదల చేయాలని హెల్త్ కార్డులను ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు మహిళలకు 18 రోజుల వేతనంతో పాటు ప్రసూతి సెలవులు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యులు ఆయుష్ వైద్యులు ఏరియా వైద్యులు జిల్లా వైద్యులు స్టాఫ్ నర్సులు అన్ని కేటగిరీల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు

# మర్పల్లి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ తెలిపారు

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 23(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్,పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం గురించిమాట్లాడారుహైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు

.మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టి యువత నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలోసారించాలని పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ తెలిపారు సూచించారు.




# జనాభా గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలి

## ముగిసిన జనాభా గణన--2027 రెండవ దశ శిక్షణ

## జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 కలెక్టరేట్**జనాభా గణన--2027లో భాగంగా గణన బ్లాకులు, ఉప గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు సూచించారు.

ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జనాభా గణన--2027 రెండవ దశకు సంబంధించి గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




ఈ సందర్భంగా ఆయన జనాభా గణనలోని 40 ప్రశ్నలు, స్వీయ గణన, సీఎంఎంఎస్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు.

హైదరాబాద్‌లోని జనాభా గణన సంచాలకుల కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు యువేందర్ బాబు, నాయుడు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు.

ఈ శిక్షణలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్, ఆర్డీఓ కృష్ణవేణి, ఛార్జ్ అధికారులైన తహసీల్దార్లు, అదనపు ఛార్జ్ అధికారులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ముఖ్య ప్రణాళిక అధికారి బి. జవహర్ లాల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, గణాంక అధికారులు భూక్యా లాల్ నాయక్, ఎం. రమేష్ బాబు, ఈడీఎం దేవేందర్ పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 కలెక్టరేట్**శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనా పాల్గొన్నారు.



ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో సోలార్ లైట్ల ఏర్పాటు, బోర్ల తవ్వకం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి అనుమతుల కోసం పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుపై ప్రజా సంఘాల నిరసన

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: బి. రాంచందర్



**జహీరాబాద్, అక్టోబర్ 23 ప్రజాబలం ప్రతినిధి:** ఓట్ల తొలగింపును నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జహీరాబాద్‌లో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. రాంచందర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాపాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ, ఆవాజ్, కేవీపీఎస్ నాయకులు ఎస్. మహిపాల్, సలీం, తుల్జారాం, నరేష్, కిరణ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రాసన వేడుకకు హాజరైన శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బాడిశ నాగ రమేష్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23 మంగపేట** ములుగు జిల్లా మంగపేట మండలం అక్కినేపల్లి మల్లారం గ్రామంలోని రాజమళ్ళ సుకుమార్ కుమారుడు అయినా దేవిక్ నందన్ అన్న ప్రాసన కు

ఆహ్వానం మేరకు వారి స్వగృహానికి హాజరై చిన్నారి చిరంజీవి దేవిక్ నందన్ ను ఆశీర్వదించిన బి ఆర్ఎస్ జిల్లా యూత్ కార్యదర్శి రమేష్

ఈ కార్యక్రమం లో కర్రీ శ్రీను,సాంబశివారావు మునిగేల సాంబుల్, భాస్కర్, రూప భద్రయ్య, కొమరాం పుల్లారావు, మునిగేల నరేష్, బియ్యని శ్రీను పాల్గొన్నారు

### నడి రోడ్డుపై కారులో మంటలు.. పూర్తిగా దగ్ధం

ఖమ్మం శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఒక కారులో మంటలు చేలరేగాయి. ఘటన లో కారు పూర్తిగా దగ్ధమయింది. కారు లో ప్రయాణికులు ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారు నుంచి పొగలు రావడాన్ని గమనించి ప్రయాణికులు వెంటనే దిగడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసారు.

### ఆ సిఐకు ప్రజల ప్రశంసలు

సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. నామినేషన్‌కు వెళ్తున్న వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులను సీఐ ప్రభాకర్ తన పోలీస్ వాహనంలో తీసుకెళ్లారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సహకరించారు. పోలీస్ వాహనంలో అభ్యర్థులను తరలిస్తున్న విజువల్స్ వైరల్ అయ్యాయి. విధి నిర్వహణలో సీఐ ప్రభాకర్ తీరుపై ప్రశంసలు కురుస్తున్నాయి.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్.



**జూబ్లీహిల్స్ ( ప్రజాబలం ప్రతినిధి) అక్టోబర్ 23** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సేవలో ముందుండాలని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పిలుపునిచ్చారు..



## విజయదశమి పండుగను పురస్కరించుకొని ఘనంగా అలయ్-బాలయ్ కార్యక్రమం

### రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గం స్థాయిలో

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 23 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు, కోలమానంగా నిలిచే, విజయదశమి పండుగ సందర్భంగా (అలాయ్ - బలాయ్, )కార్యక్రమాన్ని చౌటకూర్, మండలం తాడ్దాన్ పల్లి, లోని ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ లో ఈరోజు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఘనంగా ప్రారంభమైంది, ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాట్లాడుతూ,






అందోల్ నియోజకవర్గం లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, సుమారు 3, వేల కోట్ల పైచిలుకు రూపాయలతో, చేపట్టిన అభివృద్ధి పనులు, రోడ్లు ఆస్పత్రుల నిర్మాణాలు, నర్సింగ్ కాలేజ్, హాస్టల్ నిర్మాణాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, (కేజీబీవీ)లు వివిధ విద్యాసంస్థలలో (సిఎస్ఆర్) నిధులతో చేపట్టిన, మౌలిక సదుపాయాల కల్పన, కంప్యూటర్ ల్యాబ్ లు, బస్సులు, పాఠశాల అభివృద్ధి, సంక్షేమ హాస్టల్ లలో, మౌలిక సదుపాయాలు, అందోల్ లో, స్టేడియం అభివృద్ధి, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న, గిరిజన లా కాలేజీ, పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, చేపట్టిన కార్యక్రమాలను,

ఆందోల్ -జోగిపేట, పట్టణాల పరిసర ప్రాంతాలను, అనుసంధానం చేస్తూ, నిర్మాణం చేపట్టిన బ్రిడ్జిలు, సింగూరు,ప్రాజెక్టు బ్యాక్ వాటర్, పరిసర ప్రాంతాల ప్రజలు, అభివృద్ధికి చేపట్టిన,అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా టూరిజంల,అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, ఈ సందర్భంగా కార్యకర్తలకు వివరించారు, ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, పిసిసి సభ్యులు కిషన్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మక్త జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మీ శేషారెడ్డి, అందోల్-జోగిపేట, మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ చేర్మెన్ సురేందర్ గౌడ్,అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పిల్లోడి సతీష్, దిగంబర రావు, శేషారెడ్డి, దుర్గారెడ్డి, గణేష్, కేదార్నాథ్, వెంకటేశం, విశ్వాస్, విష్ణువర్ధన్ రెడ్డి, అశోకులు, ఆత్మ కమిటీ చైర్మన్ లు, కచూర్ రావు , మల్లారెడ్డి,సర్పంచ్ లు, కౌన్సిలర్స్, సేవాదళ్ యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కార్మిక సంఘాల, (ఎన్ ఎస్ యుఐ ) నియోజకవర్గ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్ లు, మాజీ సహకార సంఘాల చైర్మన్ లు, డైరెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు వేలాదిగా తరలివచ్చి "ఆలయ్- బాలయ్", సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహకు, శుభాకాంక్షలు తెలియజేశారు




## పోలీస్ అమరుల త్యాగం వెలకట్టలేనిది ఫస్రా సిఐ దయాకర్. ఎస్సైతాజుద్దీన్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 23** గోవిందరావుపేట్(ప్రాణాలు ఇచ్చి.. ప్రజలను కాపాడిన త్యాగధనులకు సెల్యూట్ పెడూతు పస్రా వీధుల్లో వెలిగిన కొవ్వొత్తుల కాంతుల్లో అమరవీరుల త్యాగాలు ప్రతిబింబించాయి.విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు పస్రా పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ నుండి మేడారం సెంటర్, జంక్షన్ వరకు చేపట్టిన క్యాండిల్ ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది.ఖాకీ వెనుక దాగున్న త్యాగం ఎంతో గొప్పదని, వారి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా కొనియాడారు.

## పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు



**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్-23, ప్రజాబలం ప్రతినిధి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యం,సామాజిక బాధ్యత,ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందించడంతో పాటు ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశం.

పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించారు. పీసీ నుంచి ఏఎస్ఐ హోదా వరకు (సివిల్,ఏఆర్) సిబ్బందికి ఈ క్రింది అంశాలను కేటాయించారు:

1. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఎలాంటి సేవలను ఆశిస్తారు?
2. పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర ఏమిటి? సోషల్ మీడియాకు బానిస కాకుండా వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవడం ఎలా?

అదేవిధంగా,ఎస్ఐ/ఆర్ఎస్ఐ మరియు ఆపై హోదాల అధికారులకు ఈ క్రింది అంశాలను కేటాయించారు:

1. పౌరుల నుంచి గౌరవం, ఆదరణ, సద్భావన పొందేందుకు పోలీసులు ఎలాంటి కృషి చేయాలి?
2. క్షేత్రస్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఎలా?

పోటీల్లో పాల్గొన్న సిబ్బంది తమ వ్యాసాలను తెలుగు లేదా ఆంగ్ల భాషలో రాసే అవకాశం కల్పించారు.ఇలాంటి కార్యక్రమాలు పోలీసు సిబ్బందిలో ప్రజానుకూల దృక్పథం, జవాబుదారీతనం, వృత్తిపరమైన నిబద్ధతను పెంపొందించడంతో పాటు, పోలీసు విధులు, ప్రజల పట్ల బాధ్యతలు, సమర్థవంతమైన పోలీసింగ్‌పై మరింత అవగాహన కల్పించేం దుకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

## పన్ను వసూళ్లలో వేగం పెంచాలి: అదనపు కలెక్టర్ అరుణశ్రీ



**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్ -23, ప్రజాబలం ప్రతినిధి:** పన్ను వసూళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ అన్నారు. వార్డు అధికారులు, సహాయకులు, రెవెన్యూ విభాగం సిబ్బందితో పన్ను వసూళ్ల పురోగతిపై శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆదాయం మెరుగుపరచడానికి లక్ష్యం ప్రకారం ఇంటి పన్నులు , నల్లా బిల్లులు , లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని అన్నారు. అనుమతి లేని కట్టడాలకు వంద శాతం పెనాల్టీ విధించాలని అన్నారు. నివాస గృహ అనుమతి పొంది ఆ తదుపరి వాణిజ్య భవనాలుగా మార్చిన వారికి నోటీసులు జారీ చేయాలని అన్నారు. దీర్ఘ కాలంగా పన్ను బకాయలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని అన్నారు. ఇళ్లు, భవనాల వివరాలను సేకరించి జియోట్యాగింగ్ చేయడానికి నిర్వహిస్తున్న భువన్ సర్వే శనివారం నాటికి పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఖాజా , జూనియర్ అసిస్టెంట్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



### మీ ప్రమాణం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు,



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 23:**జిల్లా కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో ఆఫీస్ సిబ్బందితో ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీ ప్రమాణం ఫేషియల్‌యాప్ ప్రవేశపెట్టడం జరిగిందని,. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మరియు కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఆదేశానుసారం, ప్రతి ఒక్కరూ మీ ప్రమాణం అటెండెన్స్ వేయాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆదేశించారు.జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తో మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేసే సిబ్బంది, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రతి ఒక్కరూ 9 గంటలకు ఇన్, 4 గంటలకు సాయంత్రం అవుట్ అటెండెన్స్ ని మీ ప్రమాణం యాప్ లో వేయాలని తెలియజేశారు. అదేవిధంగా ఆఫీస్ సిబ్బంది ఉదయం 10:00 గంటలకు ఇన్ మరియు సాయంత్రం 5 గంటలకు మీ ప్రమాణం యాప్ లో అవుట్ అటెండెన్స్ వేయాలని,ప్రతిరోజు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు, ప్రోగ్రాం ఆఫీసర్స్,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కూడా అటెండెన్స్ వేస్తూ, సిబ్బంది యొక్క అటెండెన్స్ ని ప్రతిరోజు మానిటర్ చేయాలని. మీ ప్రమాణంలో అటెండెన్స్ వేయలేని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోబడతాయని ఆదేశించారు.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com